ANN తెలుగు

Follow: @ANNTELUGU

23-09-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 187 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సమ్మక్క ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్

**ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ సర్కార్ అంగీకారం**

సీఎం విష్ణు దేవ్ సాయిని కలిసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

7 టీఎంసీ సామర్థ్యంతో నిర్మాణం..

రామప్ప–పాకల లింక్ కెనాల్‌తో 12,146 ఎకరాలకు నీరు

వివరాలు 2లో

**టాప్ న్యూస్**


### హైడ్రా బుల్డోజర్ వస్తే నేనే అడ్డుగా నిలుచుంటా..



- దమ్ముంటే అరికెపూడి కబ్జా భూమి స్వాధీనం చేసుకోండి
- కూలీ చేసుకొనే వాళ్ల ఇళ్లను కూల్చేస్తూ హీరోయిజం చూపిస్తున్నారా?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్

02

### లగ్జరీ కార్ల స్కామ్‌లో కేటీఆర్!



- ల్యాండ్ క్రూజర్‌లో ఎందుకు తిరుగుతున్నాడు?
- బసరత్ ఖాన్‌తో కేటీఆర్‌కు ఉన్న సంబంధంపై దర్యాప్తు చేపట్టాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు

02

### వీళ్లు పాకిస్థాన్, బంగ్లాదేశ్ వాళ్లా?



- పేదల ఇల్లు కూలగొట్టి జీవితాలతో చెలగాటమాడొద్దు
- వారి జోలికొస్తే మాడి మసైపోతారు
- దమ్ముంటే బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు తొలగించండి
- హైడ్రాకు ఈటల మాస్ వార్నింగ్

03

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,13,070 |
| 22 క్యారెట్ | 1,03,650 |
| సిల్వర్ (కేజీ) | 1,38,000 |

## జీఎస్టీ సంస్కరణల వల్ల తెలంగాణకు రూ.7 వేల కోట్ల నష్టం

### కేంద్రమే ఈ నష్టం భర్తీచేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- గ్లోబల్ సిటీకి చిరునామాగా హైదరాబాద్
- కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సీఎం సమీక్ష



**హైదరాబాద్, మహా**

జీఎస్టీ రేట్లు సోమవారం నుంచి అమల్లోకి రావడంతో తెలంగాణ రాష్ట్రానికి సుమారు రూ. 7,000 కోట్ల భారీ నష్టం వాటిల్లుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాలపై ఇలాంటి భారాలు మోపుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు. ఈ నష్టాన్ని కేంద్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి ఉద్యోగులకు బోనస్ ప్రకటించేందుకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. కొత్త జీఎస్టీ విధానం వల్ల తగ్గే ఆదాయాన్ని పూడ్చేందుకు కేంద్రం ఐదేళ్ల పాటు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించాలని కోరారు.


మిగతా 2లో

### దసరా బోనస్

ఒక్కో కార్మికుడికి రూ.1,95,610

- సింగరేణి కార్మికులకు రేవంత్ సర్కార్ బొనాంజా
- సింగరేణి చరిత్రలో తొలిసారి కార్మికులకు 34 శాతం లాభాల వాటా
- రూ.6,394 కోట్లు ఆదాయం రాగా.. అందులో రూ.819 కోట్లు కార్మికులకు..
- కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

02



03

### యుద్ధం అక్కర్లేదు...

- పీవోకే మనదే అవుతుంది
- 'సిందూర్ పార్ట్ 2 పాక్ కోరుకుంటే ఉంటుంది
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు

## జూబ్లిహిల్స్‌లో కాంగ్రెస్‌దే జోరు

### 56 శాతం మొగ్గు కాంగ్రెస్‌కే

బీఆర్ఎస్ 34 శాతం.. బీజేపీ 10 శాతం


**ఎఎన్ఎన్ - మహా సర్వేలో తేల్చిచెప్పిన పబ్లిక్**

కంటోన్మెంట్ రిజల్టే రిపీట్.. రేవంత్ కే జై

**హైదరాబాద్, మహా**

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కే పట్టం కడతామని అక్కడి ప్రజలు తేల్చిచెబుతున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆకస్మిక మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక రాగా, మరో వారం, పదిరోజుల్లో నోటిఫికేషన్ రానుంది. ఈ క్రమంలో తాజా పరిస్థితి తెలుసుకునేందుకు ఎఎన్ఎన్ ఛానల్ మహా పత్రిక పోల్ నిర్వహించడంతో పాటు స్థానిక బస్తీలలో సర్వే చేసింది. 18వేల మంది ప్రజలు ఈ సర్వేలో పాల్గొనగా, మెజారిటీ ప్రజలు జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతామని తేల్చిచెప్పారు. 57 శాతం మంది కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని చెప్పగా, 34 శాతం మంది బీఆర్ఎస్ వైపు, 10 శాతం మంది బీజేపీ వైపు నిలిచారు. బీజేపీని ఈ నియోజకవర్గంలో ప్రజలు ప్రధాన పోటీ దారుగా భావించడం లేదు.

మిగతా 3లో




JUBLIHILLS BY ELECTION PUBLIC OPENION



### అమ్మవారి దీక్షలో బండి

**కరీంనగర్, మహా :** శ్రీ దేవి నవరాత్రోత్సవాల సందర్భంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో సోమవారం ఉదయం కేంద్ర మంత్రి బండిసంజయ్ అమ్మవారి దీక్ష స్వీకరించారు. ప్రతీ ఏటా అమ్మవారి దీక్షను బండి సంజయ్ దీక్షగా తీసుకుంటూ దేవీనవరాత్రులు ఘనంగా జరుపుతారు.

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 82,159.97 |
| నిఫ్టీ | 25,202.35 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.4 | 162 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.4 | 162 |
| రిటైల్ గుడ్డు ధర | 5.72 | 171.72 |

## జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్ షురూ

### జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు లాభం

స్వదేశీ ఉత్పత్తులే కొనండి అమ్మండి వినియోగించండి

దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ లేఖ



**ఢిల్లీ, మహా:** జీఎస్టీ సంస్కరణలు పొదుపు పెంచుతాయని, దీని వల్ల సమాజంలోని ప్రతి వర్గానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ అనే సమిష్టి లక్ష్యాన్ని సాధించడానికి, స్వావలంబన మార్గంలో నడవడం తప్పనిసరి అని ఆయన నొక్కి చెప్పారు. ఎక్స్ వేదికగా భారతీయులు అందరికీ ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. అందులో దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ బచత్ ఉత్సవ్ (జీఎస్టీ పొదుపు పండుగ) ప్రారంభమైందని పేర్కొన్నారు. 'జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రధానంగా 5 శాతం, 18 శాతం శ్లాబులే ఉంటాయి.

మిగతా 2లో



ఇకపై ఇది తెలంగాణ భవన్ కాదు..

### జనతా గ్యారేజ్

- ట్రిపుల్ ఆర్ బాధితులకు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై తెలంగాణ భవన్ కేవలం పార్టీ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలు పరిష్కరించే 'జనతా గ్యారేజ్' అని ఆయన ప్రకటించారు.

మిగతా 2లో

### బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్ సహా తెలంగాణలోని పలుప్రాంతాల్లో భారీ వర్షా లు

02



## జీఎస్టీ సంస్కరణల వల్ల తెలంగాణకు రూ.7 వేల కోట్ల నష్టం

(మొదటిపేజీ తరువాయి)



"జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల వల్ల ఆదాయం కోల్పోతున్న రాష్ట్రాలను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసుకున్న ఆదాయం ప్రకారమే ప్రణాళికలు సిద్ధం చేసుకుందని, ఇప్పుడు ఈ నష్టం వల్ల వాటిపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి, తెలంగాణకు నష్టపరిహారం ఇప్పించేలా చొరవ చూపాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రానికి లేఖ రాస్తారని తెలిపారు. గతంలో జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు 14 శాతం కంటే ఎక్కువ ఆదాయం కోల్పోయిన రాష్ట్రాలకు కేంద్రం వీజీఎఫ్ ప్రకటించిందని, ఇప్పుడు రెండో దశ సవరణల్లోనూ అదే విధానాన్ని మరో ఐదేళ్లు కొనసాగించాలని ఆయన సూచించారు.

**గ్లోబల్ సిటీకి చిరునామా**

తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ సిటీ ఏరియాను గ్లోబల్ సిటీకి చిరునామాగా సమగ్రమైన ప్రణాళికతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మానవ జీవన ప్రమాణాలకు కొలమానమైన విద్య, వైద్యం, రోడ్డు రవాణా, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. నగర విస్తరణలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు గ్రేటర్ సిటీకి లక్షలాది కుటుంబాలు వలస వస్తున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందించే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధికి సంబంధించి వివిధ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖలు, విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్‌ను ఉన్నతమైన నగరంగా తీర్చిదిద్దడంతో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అమలు చేయాల్సిన ప్రణాళికలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు వివరిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. కోర్ అర్బన్ సిటీ అభివృద్ధిలో భాగంగా అందరికీ ప్రాథమిక విద్యను అందించే సంస్కరణలు ముందుగా అమలు చేయాలి. అందుకు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీలన్నింటినీ గుర్తించాలి. హైదరాబాద్ నగరానికి క్లీన్ ఇమేజీ తీసుకొచ్చేందుకు అధికారులు నిరంతరం శ్రమించాలి. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. క్లీన్ సిటీగా రూపొందించే ప్రణాళికలు అమలు చేసే అధికారులకు ప్రోత్సాహకం ఉంటుంది అని సీఎం అన్నారు. డ్రగ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు అమలు చేయాలి. డ్రగ్స్, గంజాయి సేవించి పట్టుబడితే బాధితులుగా చూడవద్దని, కనీసం పది రోజుల పాటు రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచాలి. చర్లపల్లి జైలు ప్రాంగణంలోనే ఈ రీహాబిలిటేషన్ సెంటర్ నిర్మించాలి.. అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , డీజీపీ జితేందర్ తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**111 ప్రతిపాదనలు**

ఈ సమావేశంలో కోర్ అర్బన్ సిటీ అభివృద్ధి ప్రణాళికను అయిదు ప్రధాన అంశాలుగా విభజించి, మొత్తం 111 ప్రతిపాదనలను స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సిటీ సమగ్రప్రగతికి ఈ ప్రణాళికలు రూపొందించారు. పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే నెలకొనగా, కాంగ్రెస్ వైపు ప్రజలు స్పష్టంగా నిలబడ్డారు.

**కాంగ్రెసే ఎందుకు?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పాలన బాగుంది. ఈ మూడేళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. గత రెండేళ్ళుగా స్వేచ్ఛగా పనిచేసుకుంటున్నాం. సన్నబియ్యం, రేషన్ కార్డులు మంచి కార్యక్రమాలు. ప్రభుత్వం కాంగ్రెస్ ఉంది.. మంచిగానే చేస్తుంది.. ఈ సమయంలో ప్రతిపక్షాన్ని గెలిపించడం వల్ల ఉపయోగం లేదు అని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సింపుల్ గా ఉంటున్నారు.. కష్టపడుతున్నారని ఎక్కువమంది చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గోపినాథ్ మంచి నాయకుడే కానీ.. కింది స్థాయి నాయకుల వల్ల ఇబ్బందులు పడ్డామని పలువురు చెప్పారు. ప్రస్తుతం కేసీఆర్ లేడు కాబట్టి తమ ఓటు కాంగ్రెస్ సర్కారుకే వేస్తామని పలువురు చెప్పారు. మైనారిటీలు , మాస్ ఎక్కువగా ఉండడం.. గతంలోనూ బిజెపికి అంతగా పట్టులేకపోవడంతో బిజెపిపై ఎక్కువమంది మాట్లాడలేదు. దీంతో బైపోల్ లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ రిజల్టే రిపీట్ అవుతుందని ఏఎన్ఎన్ మహా సర్వేలో ప్రజాభిప్రాయంగా కనబడింది. అభ్యర్థుల ప్రకటన, నోటిఫికేషన్ తర్వాత పరిస్థితులు ఇదే విధంగా కొనసాగుతాయా.. లేదా చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్ తోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని ఎక్కువమంది విశ్వసిస్తున్నారు.

# దసరా బోనస్

## ఒక్కో కార్మికుడికి రూ.1,95,610

- సింగరేణి కార్మికులకు రేవంత్ సర్కార్ బొనాంజ
- సింగరేణి చరిత్రలో తొలిసారి కార్మికులకు 34 శాతం లాభాల వాటా
- రూ.6,394 కోట్లు ఆదాయం రాగా.. అందులో రూ.819 కోట్లు కార్మికులకు..
- కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్, మహా:** దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు వరుసగా రెండో ఏడాది కాంగ్రెస్ సర్కార్ శుభవార్త అందించింది. గడిచిన ఏడాది కాలంలో సింగరేణి సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాలు, సాధించిన విజయాల ఆధారంగా కార్మికులకు 34 శాతం మేరకు బోనస్ ప్రకటించారు. ఒక్కో కార్మికుడికి బోనస్‌గా రూ.1,95,610 ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు బోనస్ అందించాలన్న అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఇతర మంత్రులు, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి లాభాల్లో 34 శాతం మేరకు 819 కోట్ల రూపాయల మేరకు బోనస్‌ను ప్రకటించామన్నారు. గతేడాది తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేల చొప్పున బోనస్ అందజేయగా, ఈసారి రూ. 5,500 చొప్పున బోనస్ చెల్లించాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నులు పోగా సింగరేణి 6,394 కోట్ల మేరకు లాభాలను గడించగా, అందులో సింగరేణి సంస్థ విస్తరణకు 4,034 కోట్లు కేటాయించారు. మిగిలిన 2360 కోట్లను వివిధ రూపాల్లో కార్మికుల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించడంతో పాటు, అందులో 34 శాతం మేరకు బోనస్ ప్రకటించారు. మొత్తంగా దాదాపు 71 వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది.

**దీపావళికి మరో ప్రకటన చేస్తాం..**

దసరా పండుగను పురస్కరించుకుని ఈ బోనస్ ప్రకటించగా దీపావళి పండుగ సందర్భంలో బోనస్‌కు సంబంధించి మరో ప్రకటన చేస్తామని సీఎం ప్రకటించారు. సింగరేణి అభివృద్ధిలో సహకరించిన కార్మిక సంఘాలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికుల త్యాగం, శ్రమ, చరిత్ర ఎప్పటికీ మరువలేమని ఈ సందర్భంగా కొనియాడారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న దశలో బొగ్గు ఉత్పత్తిని స్తంభింపజేసి ఆనాటి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణ సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు ప్రత్యేకమైన పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణలో వారి భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఎప్పుడూ గుర్తిస్తూనే ఉంటుందని చెప్పారు. బొగ్గు గనుల ద్వారా సింగరేణి మొత్తం జాతికే వెలుగులు అందిస్తోందని, దేశంలో పరిశ్రమలు లాభసాటిలో నడుస్తున్నాయంటే కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటాలను పంచాలని నిర్ణయించామని అన్నారు. శ్రమ శక్తిని నమ్ముకున్న కార్మికులకు లాభాల్లో వాటాలను పంచడంతో పాటు సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు, విస్తరణ కార్యక్రమాలు, కార్పొరేట్ రంగంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కార్మికుల సంక్షేమం, అభివృద్ధి సాధించే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో టెండర్లలో పాల్గొనకపోవడం వల్ల కోల్పోయిన రెండు గనులను తిరిగి సింగరేణి ఆధ్వర్యంలోకి తీసుకొచ్చే విషయంలో అన్ని మార్గాలను అన్వేషిస్తామని స్పష్టం చేశారు.



**బోనస్ దేశ చరిత్రలోనే తొలిసారి: భట్టి విక్రమార్క**

కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వడం దేశ చరిత్రలోనే తొలిసారి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 'సింగరేణి సంస్థలో అన్నిరకాల ఉద్యోగులు కలిసి 71 వేల మంది ఉన్నారు. సంస్థను జాగ్రత్తగా నడుపుతున్న, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి అభినందనలు. రాష్ట్రప్రభుత్వం, సింగరేణి సంస్థ కలిసి గొప్ప నిర్ణయం తీసుకున్నాయి. సింగరేణి లాభాల్లో కొంత మొత్తాన్ని ఉద్యోగులకు పంపిణీ చేయాలని నిర్ణయించాం.' అని భట్టి వెల్లడించారు. గత పదేళ్లు సింగరేణి సంస్థ కొత్త బ్లాక్‌లకు వేలంలో పాల్గొనలేని పరిస్థితి లేదని భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి సంస్థను వేలానికి దూరంగా పెట్టడం వల్ల రెండు బ్లాక్‌లు కోల్పోయిందన్నారు. ఆ రెండు బ్లాక్‌లు గత ప్రభుత్వ నేతల సన్నిహితుల చేతికి వెళ్లాయని ఆరోపించారు. సింగరేణి సంస్థను నష్టాల్లోకి నెట్టాలని గత ప్రభుత్వం ప్రయత్నించిందని విమర్శించారు. కీలక ఖనిజాల మైనింగ్‌లోకి సింగరేణి సంస్థ వెళ్లేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సింగరేణి సంస్థ మొత్తంగా రూ.6,394 కోట్లు ఆర్జించిందని భట్టి విక్రమార్క చెప్పారు.

## హైడ్రా బుల్డోజర్ వస్తే నేనే అడ్డుగా నిలుచుంటా..

### దమ్ముంటే అరికెపూడి కబ్జా భూమి స్వాధీనం చేసుకోండి

కూలీ చేసుకునే వాళ్ల ఇళ్లను కూల్చేస్తూ హీరోయిజం చూపిస్తున్నారా?

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్



**హైదరాబాద్, మహా:** ప్రభుత్వంపై బీఆర్ఎస్ బహిష్కృత ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. భూములు ఆక్రమించారంటూ కూల్చివేతలు చేపడుతున్న హైడ్రా పెద్దోళ్లను వదిలి పేదలపై ప్రతాపం చూపడం ఏమిటని, కోర్టు చెప్పినా సరే ఆదివారం ఇళ్లు కూల్చుతారా? అని ప్రశ్నించారు. పేదల ఉసురు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం గాలిపోచమ్మ బస్తీలో హైడ్రా కూల్చివేతల బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ హైడ్రా కూల్చేవేత బాధితులైన పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రూ. 50 వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. మళ్లీ హైడ్రా బుల్డోజర్ వస్తే నేనే అడ్డుగా నిలుచుంటానన్నారు. ముందు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాలలో కబ్జాలు తొలగించాలని డిమాండ్ చేశారు.

**హీరోయిజం చూపిస్తున్నారా?..**

కూలీ చేసుకొనే వాళ్ల ఇళ్లను కూల్చేస్తూ హీరోయిజం చూపిస్తున్నారా? కవిత అని మండిపడ్డారు. వెంచర్లు చేసి అమ్మటంతో చాలా మంది లక్షలు పెట్టి కొనుక్కున్నారని, వాళ్లకు ప్రభుత్వం డబ్బులు తిరిగి చెల్లించాలని, ఎకరాల కొద్దీ పెద్దవాళ్లు చేసిన కబ్జాలు ప్రభుత్వానికి కనబడటం లేదా? అని..ముందు వాటిని కూలగొట్టండని కవిత డిమాండ్ చేశారు. పేదవాళ్ల భూములు మాత్రమే ప్రభుత్వానికి కనబడుతున్నాయా? అని నిలదీశారు. పేదలకు అన్యాయం చేస్తే ప్రభుత్వానికి ఉసురు తాకుందని కవిత అన్నారు. ఇప్పుడు హైడ్రా హడావుడిగా వచ్చి పెద్ద వాళ్ల జోలికి పోకుండా...పేదల ఇళ్లను రాత్రికి రాత్రికి కూలగొట్టటం దారుణం అని తప్పుబట్టారు. చిన్న పిల్లలను.. మరోపక్క పండుగ ఉండగా.. ఈ సమయంలో వారి ఇళ్లు కూలగొట్టటం అమానుషం అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రాకు గతంలోనే కోర్టు శని, ఆదివారాలు ఎవరి జోలికి వెళ్లవద్దని స్పష్టంగా చెప్పింది అని, వాళ్లకు న్యాయం కోసం కోర్టుకు వచ్చే అవకాశం ఇవ్వాలని కోరింది అని కవిత తెలిపారు.

## జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్ షురూ

### జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు లాభం

స్వదేశీ ఉత్పత్తులే కొనండి అమ్మండి వినియోగించండి

దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ లేఖ



(మొదటిపేజీ తరువాయి)

దీని వల్ల ప్రధానంగా ఆహారం, మందులు, సబ్బు, టూత్‌పేస్టు, బీమా, సహా అనేక ఇతర వస్తువులు పన్ను రహితం అవుతాయి లేదా 5 శాతం పన్ను శ్లాబులోకి వస్తాయి. గతంలో 12 శాతం పన్ను పరిధిలో ఉన్న వస్తువులు ఇప్పుడు 5 శాతం ట్యాక్స్ పరిధిలోకి వచ్చాయి. దుకాణదారులు, వ్యాపారులు ఇంతకు ముందు, ఇప్పుడు జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులను సూచించే బోర్డులను ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉంది' అని మోదీ అన్నారు.

**రూ.2.5 లక్షల కోట్ల పొదుపు అవుతుంది..**

గత కొన్నేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. ఇప్పుడు అనేక ఆకాంక్షలు కలిగిన నవమధ్యతరగతి ప్రజలు ఉద్భవించారు. మా ప్రభుత్వం మరింతగా పన్నులు తగ్గించి, మన మధ్యతరగతి ప్రజలను బలోపేతం చేస్తాం. అంటే వ్యక్తుల వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఉంటే, వారు కట్టాల్సిన పన్ను సున్నా ఉండేలా చూస్తాం. ఆదాయ పన్ను కోతలు, జీఎస్టీ సంస్కరణలు రెండింటినీ కలిపితే, ప్రజలకు దాదాపు రూ.2.5 లక్షల కోట్ల పొదుపు అవుతుంది. 2017లో ప్రారంభమైన జీఎస్టీ ప్రయాణం పౌరులను, వ్యాపారులను బహుళ పన్నుల వల నుంచి విముక్తి చేసింది. ఒకే దేశం ఒకే పన్ను ఏకరూపత తెచ్చిపెట్టింది. కచ్చితంగా చెప్పాలంటే, జీఎస్టీ దేశాన్ని ఆర్థికంగా ఏకం చేసింది" అని మోదీ అన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల చిన్న పరిశ్రమలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు, ఎంఎస్ఎంఈలు లాభపడ్డాయని, అయితే 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యం నెరవేరాలంటే, స్వావలంబన మార్గంలో నడవడం తప్పనిసరి అని మోదీ నొక్కి చెప్పారు.

## సమ్మక్క ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్

### ఎన్ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ సర్కార్ అంగీకారం

సీఎం విష్ణు దేవ్ సాయిని కలిసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

7 టీఎంసీ సామర్థ్యంతో నిర్మాణం.. రామప్ప–పాకల లింక్ కెనాల్‌తో 12,146 ఎకరాలకు నీరు



**హైదరాబాద్, మహా:** గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు మరో అడుగు ముందుకు పడింది. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిష్కారం లభించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో మాట్లాడి అనుమానాలు నివృత్తి చేశారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించింది. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌తో సమావేశమయ్యారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుపై నెలకొన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు రాయ్‌పూర్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో ఛత్తీస్‌గఢ్‌లోని భూభాగాలు ముంపునకు గురి అవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై రెండు ప్రభుత్వాల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెల్లించే నష్టపరిహారం ఇచ్చేందుకు తెలంగాణ ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో ప్రాజెక్టుకు ఎన్ఓసీ ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినట్టు ప్రచారం జరుగుతోంది.

**రామప్ప–పాకల లింక్ కెనాల్‌తో 12,146 ఎకరాలకు నీరు..**

గోదావరి నదిపై సమ్మక్క సాగర్ బ్యారేజ్ ప్రాజెక్టు సాగునీటి స్థిరీకరణ, తాగునీరు సరఫరా, విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో నిర్మించ తలపెట్టారు. ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద ప్రారంభించారు. ఇది ఇంద్రావతిగోదావరి లింక్ కోసం ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టు మొదట 'కంతనపల్లి బ్యారేజ్'గా ప్రతిపాదించారు. ఇది పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి ప్రాజెక్ట్‌లో భాగం 2016లో భూసేకరణ సమస్యలు నివారించేందుకు స్థానాన్ని మార్చారు. 2017 ఫిబ్రవరి 13న నిర్మాణం ప్రారంభమైంది. 2020 ఫిబ్రవరి 13న తుపాకులగూడెం బ్యారేజ్‌ను 'సమ్మక్క బ్యారేజ్'గా పేరు మార్చారు. ఇది సమ్మక్క సరలమ్మ జాతరకు సమీపంలో ఉండటం వల్ల ఈ పేరు పెట్టారు. దీని నిర్మాణ బాధ్యతను రిథ్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఈ ప్రాజెక్టు ఏటూరునాగరం వన్యప్రాణుల అడవి సంరక్షణ ప్రాంతానికి సమీపంలో ఉంది. ఈ ప్రాజెక్టు 83 మీటర్ల ఎత్తుతో 1,132 మీటర్ల పొడవుతో 48 రేడియల్ లిఫ్ట్ గేట్లతో నిర్మించనున్నారు.



ఇకపై ఇది తెలంగాణ భవన్ కాదు..

## జనతా గ్యారేజ్

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికి ఏ కష్టం వచ్చినా ఇక్కడికి రావచ్చని, న్యాయ సహాయం కోసం నిపుణులైన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ వల్ల నష్టపోతున్న రైతులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. నల్గొండ, సూర్యాపేట, గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చిన బాధితులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులతో తామే స్వయంగా రోజుల తరబడి చర్చలు జరిపి, మెరుగైన పరిహారం, ఇళ్లు ఇచ్చి ఒప్పించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లడానికే ముఖం చాటేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే అలైన్‌మెంట్లు మార్చి రైతులను ఇబ్బందులకు గురిచేసిందని కేటీఆర్ విమర్శించారు. అలైన్‌మెంట్లు మార్చి పేదల జీవితాలతో ఆడుకోవడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని అన్నారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను శాస్త్రీయంగా ఖరారు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో రైతులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

### హైదరాబాద్ సహా తెలంగాణలోని పలుప్రాంతాల్లో భారీ వర్షా లు

**హైదరాబాద్, మహా:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట మొదలైన ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచిపోయింది. ఖైరతాబాద్ రాజ్ భవన్ రోడ్డులో మోకాలి లోతు వరకు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా మరియు జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోమవారం, మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## లగ్జరీ కార్ల స్కామ్‌లో కేటీఆర్!

- ల్యాండ్ క్రూజర్‌లో ఎందుకు తిరుగుతున్నాడు?
- బసరత్ ఖాన్‌తో కేటీఆర్‌కు ఉన్న సంబంధంపై దర్యాప్తు చేపట్టాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. లగ్జరీ కార్ల స్కామ్ నిందితుడు బసరత్ ఖాన్‌తో కేటీఆర్‌కు ఉన్న సంబంధంపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బసరత్ ఖాన్ అక్రమంగా దిగుమతి చేసిన ల్యాండ్ క్రూజర్ కార్లలో ఎందుకు తిరుగుతున్నాడు? బీఆర్ ఎస్ పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తుందా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఆ కార్లు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీల పేర్లతో ఎందుకు రిజిస్టర్ అయ్యాయి?..వాటికి మార్కెట్ ధర చెల్లించారా? లేక తక్కువగా చూపించి కొనుగోలు జరిగిందా? అని దర్యాప్తు సంస్థలు విచారించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కార్లకు చెల్లింపులు బినామీ పేర్లతోనా? నకిలీ ఆదాయమా? లేక మనీలాండరింగ్ ద్వారా జరిగిందా? అన్నది విచారణలో తేల్చాలన్నారు. ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందిందని ? వాస్తవాలు బయటకు రావాలంటే సంబంధిత శాఖలు విచారణ చేపట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

**కేటీఆర్‌కు లింకులు ఉన్నాయన్న ఆరోపణలు?**

ల్యాండ్ క్రూజర్ కార్లు స్మగ్లర్ బసరత్ ఖాన్‌తో కేటీఆర్‌కు లింకులు ఉన్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే ఆయన ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ల్యాండ్ క్రూజర్ కార్ల స్కామ్ లో ఆయన ప్రమేయంపై ఆరోపణలు చోటుచేసుకున్నాయి. బసరత్ ఖాన్ స్మగ్లింగ్ చేసిన ల్యాండ్ క్రూజర్ వాహనం కేటీఆర్ వాడుతుండటం ఇప్పుడు వివాదస్పదమైంది. ల్యాండ్ క్రూజర్ వాహనాల స్మగ్లింగ్ కేసులో మొత్తం 8 వాహనాలను స్మగ్లింగ్ చేసినట్లు నిందితుడు బసరత్ ఖాన్ డీఆర్ఐ అధికారుల విచారణలో ఒప్పుకున్నాడు. తాను స్మగ్లింగ్ చేసిన 8 ల్యాండ్ క్రూజర్ల వాహనాల నెంబర్ల వివరాలతో అధికారుల ముందు వాంగ్మూలం ఇచ్చాడు. ఆ వాహనాల్లో కేటీఆర్ వాడుతున్న వెహికల్ (టీఎస్09డి 6666) కూడా ఉన్నట్లు బసరత్ ఖాన్ అంగీకరించాడు.

# వీళ్లు పాకిస్థాన్.. బంగ్లాదేశ్ వాళ్లా?

## పేదల ఇల్లు కూలగొట్టి జీవితాలతో చెలగాటమాడొద్దు

### వారి జోలికొస్తే మాడి మసైపోతారు


### దమ్మొంటే బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు తొలగించండి

### హైడ్రాకు ఈటల మాస్ వార్నింగ్

**హైదరాబాద్, మహా:** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రా అధికారులకు దమ్మొంటే ప్రభుత్వ స్థలంలో బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు తొలగించాలని సవాల్ విసిరారు. హైడ్రా అధికారులు పేదల ఇల్లు కూలగొట్టి వారి జీవితాలతో చెలగాటమాడవద్దని హితవు పలికారు. కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలని రాజ్యాంగం చెప్పిందని.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పేదల జోలికి రావడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్ రూం ఏమోకానీ.. 40 ఏళ్లుగా ఇక్కడే బతుకుతున్న పేదల ఇళ్లు కూల్చారని ధ్వజమెత్తారు. గాజులరామారంలో కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను సోమవారం పరామర్శించారు. బస్తీలన్నీ కలియ తిరిగి బాధితులతో మాట్లాడి ధైర్య చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే బాధితులకు కరెంటు, నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాతలు, తండ్రులు, ఇప్పుడు పిల్లలు ఉంటున్నారని చెప్పుకొచ్చారు. గుట్టలు, పుట్టలు ఉండి మనిషి ఉండే దిక్కులేనప్పుడు రూ. 5 వేలకు ఎకరం ఉన్న దగ్గరి నుంచి వీరు ఇక్కడ ఉంటున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వడ్డెరలు వచ్చారని చెప్పుకొచ్చారు ఎంపీ ఈటల రాజేందర్.

**బ్రోకర్లను ఉరి తీయండి, అరెస్ట్ చేయండి..**

కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేసి కాళ్లు, చేతులు పోగొట్టుకొని మరీ పేదలు ఇక్కడ బతుకుతున్నారని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. 60 గజాల గుడిసెల్లో ఉండే వారి మీదనా హైడ్రా ప్రతాపమని హెచ్చరించారు. దేశం ఇంకో దేశం మీద దాడి చేసినట్లుగా.. దొంగ దెబ్బ తీసినట్లు.. పదుల సంఖ్యలో జేసీబీలు పెట్టి ఆదివారం వచ్చి పేదల ఇళ్లను కూలగొట్టారని ఫైర్ అయ్యారు. ఇళ్లను కూలగొట్టడంతో రాత్రి అంతా ఆ పిల్లలతో వర్షంలోనే తడుస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు స్తంభాలు కూలగొట్టి, కరెంటు లేకుండా, తాగడానికి నీళ్లు లేకుండా చేశారని మండిపడ్డారు. ఇక్కడి పేదల దీనాస్థితి చూసైనా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించాలని హితవు పలికారు. బ్రోకర్లను ఉరి తీయండి, అరెస్ట్ చేయండి.. కానీ 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఉంటున్న పేదల ఇళ్లను కూలగొట్టి ఆడబిడ్డలకు బతుకమ్మ సంబరాలు లేకుండా చేసి వారి కన్నీటిని చూశారని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్. రూ. 15 వేల కోట్ల స్థలాలు కాపాడామని హైడ్రా అధికారులు అంటున్నారని.. కానీ ఇక్కడ ఉంది 300 గుడిసెలు, పేదల ఇళ్లని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్లని కూలగొట్టి రూ.15 వేల కోట్ల స్థలాలు కాపాడామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడానికి సిగ్గు ఉండా అని ఫైర్ అయ్యారు.










# విజయవాడకు నూతన శోభ

- విజయవాడ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెబుతుంది
- విజయవాడ ఉత్సవ్ ప్రారంభించిన వెంకయ్యనాయుడు, నారాలోకేష్
- క్రాకర్స్ షో, ప్రకాశం బ్యారేజీపై బాణసంచా వెలుగులు కనువిందు




**విజయవాడ, మహా:** విజయవాడ ఉత్సవ్ ఘనంగా ప్రారంభమైంది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరై విజయవాడ ఉత్సవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రాకర్స్ షో కళ్లు మిరిమిట్లు గొలిపింది. ప్రకాశం బ్యారేజీపై బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి. వెంకయ్య నాయుడు, లోకేశ్ పున్నమి ఘాట్‌లో క్రాకర్స్ షోను తిలకించారు. 'ఒకే నగరం ఒకటే సంబరం' అనే నినాదంతో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్' ఏర్పాట్లను వెంకయ్య నాయుడు అభినందించారు.

**విజయవాడ గొప్పతనాన్ని ప్రపంచానికి.,**

విజయవాడ ఉత్సవ్2025లో పాల్గొనడం సంతోషంగా ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఈ ఉత్సవ్ తో విజయవాడకు నూతన శోభ సంతరించుకుందని చెప్పారు. 'విజయవాడ ఉత్సవ్ 2025 ద్వారా విజయవాడ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నారు. మంచి చేసే వారిని ఎప్పుడూ గౌరవించాలి. రాజధాని విజయవంతం కావాలంటే ఎడ్యుకేషన్, ఎంటర్ టైన్ మెంట్ అవసరం. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుంది' అని వెంకయ్య నాయుడు చెప్పారు. 'కుటుంబ వ్యవస్థ ప్రస్తుతం ఛిన్నాభిన్నం అవుతోంది. వంట విడిపోతే జంట విడిపోద్ది.. వంటను కాపాడుకోండి. భాష పోతే.. శ్వాస పోయినట్టే.. అందరూ మాతృ భాషను కాపాడుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఇవ్వాలని చంద్రబాబును కోరా.. ఇవాళ తెలుగులో ఇచ్చారు సంతోషం. ప్రైవేట్ వ్యక్తులు ముందుకొచ్చి విజయవాడ ఉత్సవ్ నిర్వహించడం మంచి పరిణామం. ఫాస్ట్ లైఫ్, ఫాస్ట్ ఫుడ్ కు అలవాటు పడిపోయారు. అది మంచిది కాదు. విజయవాడ ఉత్సవ్ సక్సెస్ కావాలంటే అందరూ కష్టపడి పనిచేయాలి' అని వెంకయ్య నాయుడు అన్నారు.

### యుద్ధం అక్కర్లేదు...

# పీవోకే మనదే అవుతుంది

### 'సిందూర్ పార్ట్ 2 పాక్ కోరుకుంటే ఉంటుంది

### కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు

**మహా:** ఉగ్రవాదులకు మద్దతిస్తోన్న పాకిస్థాన్‌కు సరిహద్దుల్లోనే కాకుండా వారి సొంతగడ్డపైనా గట్టిగా బుద్ధి చెప్పామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' విజయాలను పంచుకున్నారు. 'సిందూర్ పార్ట్ 2' అనేది పాక్ తీరుపై ఆధారపడి ఉంటుందని దాయాదిని హెచ్చరించారు. 'ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ మన పౌరులను చంపేశారు. మేం మతం చూసి వారిని (ఉగ్రవాదులను) మట్టుబెట్టలేదు. వారు చేసిన పనులు చూసి చంపేశాం. పహల్గాం ఘటన జరిగిన తర్వాత త్రివిధ దళాల అధిపతులతో జరిగిన సమావేశంలో వారిని నేను ఒకే ప్రశ్న అడిగాను. ఒకవేళ ప్రభుత్వం ఆమోదం తెలిపితే.. ఆపరేషన్‌కు మీరు సిద్ధమా? అని ప్రశ్నించాను. వారు



నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీంతో మేం ప్రధాని మోదీని కలిస్తే.. ఆయన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తుతానికి నిలిపివేశాం. అది ఎప్పుడైనా మళ్లీ మొదలవ్వొచ్చు. సిందూర్ పార్ట్ 2, పార్ట్ 3 అనేది పాక్ చర్యలపై ఆధారపడి ఉంటుంది. వారు ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తే గనుక మేం తగినవిధంగా బుద్ధి చెబుతాం'' అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు.

# రూ. 50 వేల కోట్ల భూమిని కాపాడాం

### హైడ్రా ప్రెస్ మీట్‌లో కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి

**హైదరాబాద్, మహా:** భారీ వర్షాలు ఒక వైపు.. కబ్జాల తొలగింపు మరో వైపు.. ఇలా మల్టీ టాస్కుతో హైడ్రా పని చేస్తోందని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. హైడ్రా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ రూ. 50 వేల కోట్ల విలువైన 923.14 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామన్నారు. ఇలా చెరువులు, కాలువల్లో ఆక్రమణలను తొలగించి.. ప్రకృతిని పరిరక్షించడం ద్వారా నగరానికి మంచి భవిష్యత్తును ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. హైడ్రా కార్యకలాపాలను వివరించేందుకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు హైడ్రా చర్యలన్నీ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హైడ్రా పట్ల నగర ప్రజలందరికి మంచి అభిప్రాయం ఉందని.. ఒకరిద్దరు విమర్శించినా భవిష్యత్తులో వాళ్లు కూడా మెచ్చుకుంటారని అన్నారు. తన సర్వీసులో విమర్శలు కొత్త కాదని.. తర్వాత రియలైజ్ అయిన ఘటనలున్నాయన్నారు. ఉదాహరణ 2007వ సంవత్సరం విజయవాడలో జరిగిన అయేషామీరా హత్య కేసులో నిందితుడిగా సత్యం బాబును గుర్తించడంతో పాటు.. నల్గొండ జిల్లాలో జరిగిన ప్రణయ్ పరువు హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన దర్యాప్తులే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పుడు హైడ్రా చర్యలు కాస్త కఠినంగా అనిపించినా.. నగర భవిష్యత్తు బాగుండాలంటే తప్పవని పేర్కొన్నారు. గొలుసుకట్టు చెరువులను, కాలువలను, ప్రభుత్వ భూములను కాపాడుకోలేకపోతే.. పర్యావరణం దెబ్బతింటుందని హెచ్చరించారు.

**923.14 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం..**

ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 923.14 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. దీని విలువ రూ. 50 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఈ నెల 21న గాజుల రామారం, ప్రగతినగర్ మధ్యన 317 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెందిన ఈ భూమి కబ్జాలకు గురౌతుంటే.. స్థానికుల ఫిర్యాదుమేరకు విచారణ జరిపి.. ఆదివారం నాడు కబ్జాలనుతొలగించాం. ప్రగతినగర్‌వైపు బడాబాబులు కబ్జాలుంటే.. పదుల ఎకరాల్లో వెంచర్లను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాం. ఇలా ఇప్పటి వరకూ 581 ఆక్రమణలను తొలగించాం.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే జోరు

## 56 శాతం మొగ్గు కాంగ్రెస్‌కే

(మొదటిపేజీ తరువాయి)

పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే నెలకొనగా, కాంగ్రెస్ వైపు ప్రజలు స్పష్టంగా నిలబడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ పాలనకు జై కొడుతున్నారు.

**కాంగ్రెసే ఎందుకు?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పాలన బాగుంది. ఈ మూడేళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. గత రెండేళ్ళుగా స్వేచ్ఛగా పని చేసుకుంటున్నాం. సన్నబియ్యం, రేషన్ కార్డులు మంచి కార్యక్రమాలు. ప్రభుత్వం కాంగ్రెస్ ఉంది.. మంచిగానే చేస్తుంది.. ఈ సమయంలో ప్రతిపక్షాన్ని గెలిపించడం వల్ల ఉపయోగం లేదు అని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సింపుల్ గా ఉంటున్నారు.. కష్టపడుతున్నారని ఎక్కువమంది చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గోపినాథ్ మంచి నాయకుడే కానీ.. కింది స్థాయి నాయకుల వల్ల ఇబ్బందులు పడ్డామని పలువురు చెప్పారు. ప్రస్తుతం కేసీఆర్ లేదు కాబట్టి తమ ఓటు కాంగ్రెస్ సర్కారుకే వేస్తామని పలువురు చెప్పారు. మైనారిటీలు , మాస్ ఎక్కువగా ఉండడం.. గతంలోనూ బిజెపికి అంతగా పట్టులేకపోవడంతో బిజెపిపై ఎక్కువమంది మాట్లాడలేదు. దీంతో బైపోల్ లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ రిజల్టే రిపీట్ అవుతుందని ఎఎన్ఎన్ మహా సర్వేలో ప్రజాభిప్రాయంగా కనబడింది. అభ్యర్థుల ప్రకటన, నోటిఫికేషన్ తర్వాత పరిస్థితులు ఇదే విధంగా కొనసాగుతాయా.. లేదా చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్ తోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని ఎక్కువమంది విశ్వసిస్తున్నారు.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

**IN THE COURT OF THE III ADDL.JUNIOR CIVIL JUDGE:**

**AT: MALKAJGIRI**

**O.S.NO. 882 OF 2023**

Between:

**CANARA BANK** {Previously known as Syndicate Bank}
Malkajgiri Branch, Hyderabad
Represented by its Branch Manager:
ManjushaKasturi W/o.M.Dilip,
aged about 39 years, R/o Hyderabad ... PLAINTIFF

A N D

**A,Venkata Lakshmi**
Prop.SriSatyamamba Ladies Tailors
D.No.26-122-26-52-A, Sarada Nagar
Safilguda, Hyderabad 50047 Telangana .... Defandant

Please take notice that the above named plaintiff filed O.S. No. 882 of 2023 for passing of a decree for recovery of **Rs.2,35,876.38**(Rupees TwoLakhsthirty five eightHundred seventy sixrupeesthirty eight paisaonly) against you before the above said Hon'ble Court. The said case is posted to **06-10-2025** you shall appear before the above said court at 10:30 A.M. on **06-10-2025** either in person or through an advocate. Otherwise the matter will be heard and decided as per law.

**( By the order of theHonble Court )**
Sd/- **Malladi Surya Prakash**
Advocate,H.No.6-257/A, Sunshine Colony, DammaigudaKeesaraMandal,
MedchalMalkajgiri District, 500083, Telangana.

EDITORIAL సంపాదకీయం

# హెచ్-1బీ వీసా సంక్షోభం వేళ

## చైనా కే-వీసా సంచలనం

సంక్షోభాలను అనుకూలంగా మలుచుకోవడంలో చైనా రూటే సపరేటు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్ 1బీ వీసా ఫీజును భారీగా పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న గందరగోళాన్ని చైనా వ్యూహాత్మకంగా అనుకూలంగా మలుచుకోవాలని డిసైడ్ అయింది. హెచ్ 1బీ వీసా సంక్షోభం వేళ.. విదేశీ నిపుణులను ఆకర్షించేందుకు చైనా కొత్తగా "కేవీసా" అనే ఒక ప్రత్యేక వీసాను ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా భారతదేశం వంటి దేశాల నుంచి నిపుణులైన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, టెక్ నిపుణులను తనవైపు తిప్పుకోవడమే ఈ వ్యూహాత్మక నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. గత ఆగస్టులోనే ఆమోదం పొందిన ఈ వీసాకు సంబంధించిన కొత్త నిబంధనలు అక్టోబర్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. చైనా న్యాయ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. చైనా లేదా విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుంచి ఎస్టీఈఎం రంగాల్లో బ్యాచిలర్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత సాధించిన యువ శాస్త్రీయ, సాంకేతిక ప్రతిభావంతులకు ఈ కే వీసా అందుబాటులో ఉంటుంది. అలాగే అలాంటి సంస్థల్లో బోధన, పరిశోధనలో నిమగ్నమైన యువ నిపుణులు కూడా ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు చైనా అధికారులు నిర్దేశించిన అర్హతలను, అవసరాలను తప్పనిసరిగా నెరవేర్చాలి. వారు తమ విద్యా అర్హతలు, వృత్తిపరమైన లేదా పరిశోధనా అనుభవానికి సంబంధించిన పత్రాలను అందించాల్సి ఉంటుంది.

### కే-వీసా సులభతరం

చైనాలో ప్రస్తుతం ఉన్న 12 సాధారణ వీసా కేటగిరీలతో పోలిస్తే.. కేవీసా అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇది బహుళ ప్రవేశాలు, సుదీర్ఘ కాల పరిమితి అలాగే దేశంలో ఎక్కువ కాలం ఉండే సౌలభ్యాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. అనేక రకాల వర్క్ వీసాల మాదిరిగా కాకుండా ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారికి చైనాలో పనిచేసే ఒక సంస్థ నుంచి ఆహ్వానం అవసరం లేదు. ఇలా ఇది ప్రక్రియను మరింత సరళంగా మారుస్తుంది. చైనాలో ప్రవేశించిన తర్వాత కేవీసా హోల్డర్లు వ్యాపార కార్యకలాపాలతో పాటు విద్య, సంస్కృతి, సైన్స్, టెక్నాలజీ వంటి రంగాలలో కూడా పాల్గొనడానికి అనుమతిస్తారు. నిర్దిష్ట వయస్సు, విద్య, పని అనుభవానికి సంబంధించిన అర్హతలు ఉన్నవారికి ఆహ్వానం లేకుండానే దరఖాస్తు ప్రక్రియ సులభతరం అవుతుందని అధికారిక ప్రకటన తెలిపింది. ఈ కొత్త వీసా విధానం అంతర్జాతీయ మార్పిడికి చైనాను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి బీజింగ్ చేస్తున్న విస్తృత ప్రయత్నాల్లో భాగం. గత కొన్ని సంవత్సరాలుగా చైనా తన ప్రవేశ నిబంధనలను సులభతరం చేస్తూ.. వీసా రహిత ప్రయాణ అవకాశాలను పెంచుతోంది. అధికారిక డేటా ప్రకారం.. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 38.05 మిలియన్ల మంది విదేశీయులు చైనాను సందర్శించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 30.2 శాతం పెరిగింది. ఈ ప్రయాణాల్లో 13.64 మిలియన్లు వీసా రహిత ప్రవేశాలు కావడం విశేషం. హెచ్ 1బీ సంక్షోభం వేళ చైనా తీసుకున్న ఈ నిర్ణయం దక్షిణాసియా నిపుణులకు, ముఖ్యంగా భారతీయులకు ఒక కొత్త మార్గాన్ని చూపిస్తుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అధిక ఖర్చు, సుదీర్ఘ ప్రక్రియ వంటి సమస్యలు లేకుండా విదేశాల్లో అవకాశాలు వెతుక్కుంటున్న వారికి ఈ వీసా ఒక గొప్ప అవకాశం కల్పించవచ్చని వారు భావిస్తున్నారు. అయితే కేవీసా అమెరికా, ఐరోపా దేశాల సాంప్రదాయ కీర్తిని, కెరీర్ అవకాశాలను అందుకుంటుందా లేదా అన్నది ముందుముందు తెలుస్తుంది.

- మహా డెస్క్




# ఎవరి ఒత్తిడి, ఎవరి లాభం?

## జీఎస్టీ తగ్గింపుల తెర వెనక సత్యం

జీఎస్టీ స్లాబ్ ల మార్పు, ప్రత్యేకంగా 28% నుండి 18% వంటి తగ్గింపులు, ఎందుకు జరుగుతాయి? ఇది సాధారణ వినియోగదారుల కన్నీళ్ళ ఫలితమా లేక వ్యాపార వర్గాల ఒత్తిడా? దీన్ని ఆర్థిక శాస్త్ర దృష్టితో విశ్లేషిద్దాం. ఒక ప్రాథమిక ఆర్థిక సూత్రం ప్రకారం, ఒక సరుకుపై పన్ను పెరిగినప్పుడు, దాని అమ్మకాలు అదే శాతంతో తగ్గుతాయి. ఉదాహరణకు, ఒక సరుకుపై 28% జీఎస్టీ ఉంటే, వినియోగదారులు ఖర్చు చేసే అదే డబ్బుతో 100 యూనిట్లకు బదులు 72 యూనిట్లను మాత్రమే కొనగలరు. మిగిలిన 28 యూనిట్ల సరుకు ధరకు సమానమైన పన్ను సరకార్ ఖజానాకు వెళ్తుంది. అంటే, సరుకు గోడౌన్లలోనే కుప్పకెక్కుతుంది.

### ఈ పన్నును 28% నుండి 18%కి తగ్గిస్తే ఏమవుతుంది?

ఇప్పుడు,వినియోగదారులు ఖర్చు చేసే అదే డబ్బుతో 72 యూనిట్లకు బదులు 82 యూనిట్లను కొనగలరు. గోడౌన్ల నుండి ఎక్కువ సరుకు మార్కెట్లోకి విడుదల అవుతుంది. ఇక్కడ ప్రధానాంశం ఏమిటంటే, వినియోగదారులు ఖర్చు చేసే మొత్తంలో మార్పు లేదు, కానీ వారు పొందే సరుకుల పరిమాణం పెరిగింది. దీని ఫలితంగా వ్యాపారుల అమ్మకాలు 72 నుండి 82కి పెరిగి, వారి లాభాలు పెంపొందుతాయి. ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయం మాత్రం తగ్గుతుంది.

### వ్యాపార వ్యూహం

సాధారణ ప్రజల ఒత్తిడా ? 72 యూనిట్లు కొనగలిగే వినియోగదారులు ఇప్పుడు 82 యూనిట్లు కొనగలిగే అవకాశం పొందారు. ఇది నిస్సందేహంగా వారికి ఒక ఉపకారమే. అయినా, ఈ మార్పుకు ప్రధాన కారణం వారి నిరసనలు లేదా కన్నీళ్లు అనడానికి ఆధారాలు ఉన్నాయా? బీహార్ ఎన్నికలు వంటి రాజకీయ కారణాలు పూర్తిగా విస్మరించలేము, కానీ అవి మాత్రమే ప్రధాన చోదకశక్తి అని నిర్ధారించడం కష్టం. ఈ సంస్కరణ యొక్క నిజమైన లాభార్థులు ఎవరు? అమ్మకాలు మరియు లాభాలు పెరిగే వర్గం వ్యాపారులు, వర్తకులు మరియు పారిశ్రామికవేత్తలు. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ గొలుసులోని ఈ వర్గాలే (జనాభాలో చిన్న భాగం) తమ ఎక్కువ అమ్మకాల కోసం తెరవెనుక శక్తివంతమైన ఒత్తిడి తెచ్చి ఉండవచ్చు. ఎక్కువ అమ్మకం అంటే ఎక్కువ లాభం కాబట్టి, ఈ వర్గాల ప్రయత్నాలు ఎక్కువగా ఉంటాయి. జీఎస్టీ తగ్గింపు వినియోగదారులకు ప్రత్యక్షంగా లాభదాయకమే. అయితే, ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన చోదకశక్తి సాధారణ ప్రజల ఆర్థిక ఒత్తిడి కంటే, వ్యాపార వర్గాల ఆర్థిక హితాలు మరియు వారి ఒత్తిళ్లే అని ఆర్థిక విశ్లేషణ సూచిస్తుంది. ప్రభుత్వం యొక్క నిర్ణయం రాజకీయ మరియు ఆర్థిక కారకాల కలయిక ఫలితమైనప్పటికీ, తెరవెనుక జరిగే ఈ ఆర్థిక డ్రామాలో వ్యాపార వర్గాల ప్రభావమే ఎక్కువగా కన్పిస్తుంది.




- డా. రాత్లావత్ కృష్ణ,
సహా. ఆచార్యులు(అతిథి), ఆర్థిక శాస్త్రం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల-నాగర్‌కర్నూల్.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999



# దేశ ప్రయోజనాలు దెబ్బతీస్తున్న మోదీ

మోదీ హిందూ జాతీయ వాద ధోరణి కారణంగా నేపాల్ , బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలలో భారత వ్యతిరేక భావనలు పెరిగాయి .ఉదాహరణకు అఖండ భారత్ మ్యాప్ వివాదం నేపాల్ ను చైనా వైపు నెట్టింది .దీనవల్ల భారత భౌగోళిక భద్రతా ప్రయోజనాలు దెబ్బతిన్నాయి .యూరోపియన్ యూనియన్ అమెరికా వంటి దేశాలతో సహకారం ఉన్నప్పటికీ మణిపూర్ హింస మైనారిటీ లపై అసహనం వంటి దేశీయ సమస్యలకు దారి తీశాయి. ఇది భారత్ యొక్క సాఫ్ట్ పవర్ ను బలహీన పరుస్తుంది . మరియూ , వాణిజ్య సహకారాలను ర్రభావితం చేస్తుంది .మోదీ ప్రభుత్వం 'సరెండర్'సరెండర్ పాలసీ ' అనుసరిస్తున్నదని కాంగ్రెస్ విమర్శిస్తూ , అమెరికా మధ్యవర్తిత్వాన్ని అనుమతించడం ద్వారా సిమ్లా ఒప్పందాన్ని ఉల్లసించి , భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని దెబ్బతీసిందని చెబుతోంది .ఇది ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు లేకుండా చేస్తుంది .ఇతర దేశాలతో మునుపటి ముఖ్యంగా పశ్చిమ దేశాలతో సహకరిస్తున్నప్పటికీ చైనా దూకుడుకు సరైన ప్రతిస్పందన లేకపోవడం , పొరుగు దేశాలు చైనా వైపు మళ్ళడం వల్లన భారత్ భద్రత , ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి . ఇవి ప్రధాన విమర్శలు కాగా మోదీ విదేశాంగ విధానం కొన్ని ప్రయోజనాలను కూడా తెచ్చిందనికొందరు అంటున్నారు .ఇది రాజకీయ దృక్పథాలపై ఆధారపడి ఉంటుంది .

- మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి , సూర్యాపేట
సెల్ - 9885045344

# విదేశీ విధానాలతో ఎన్ఆర్ఐల మానసిక ఒత్తిడి

ఉన్నతవిద్యకొరకు ,ఉత్తమమైన ప్రమాణాలతో జీవన విధానంలో జీవిత మార్పు కొరకు , భారతీయ విద్యార్థులు తమ భౌషత్ కొరకు విదేశీ బాటపట్టారు. అదే వారి పాలిట 'ట్రంపు'రూపంలో శాపంగా మారనుంది. ఆర్థిక వెసులుబాటు తో కొంతమంది, ఆర్థిక వెసులుబాటు లేకపోయినా బ్యాంకు ఋణాలతో మరి కొంతమంది తమ పిల్లల భౌషత్ కొరకు బంగారు బాటను ఊహించి విదేశీ చదువు ను ప్రోత్సహించారు తల్లిదండ్రులు. ఆస్తులు తాకట్టు పెట్టి రుణగస్తులై పిల్లలు అడిగిందే తడువుగా ఏదేశం పడితే ఆ దేశం పంపించారు. ఒకరి వెనుక ఇంకొకరు 'క్యూ'కట్టి వెళ్ళారు. యువత అంతా భారత దేశం ఖాళీ చేసి వెళ్ళుతున్నారు అన్నంతగా భ్రాంతి కలిగించారు.అక్కడ ఉద్యోగం పొంది విలాసవంతమైన బంగ్లా, కారు కోట్లలో కొనుగోలు చేసి తమ జీవితాలు ఈఎంఐ లకు తాకట్టు పెట్టి ఇప్పుడు ఉద్యోగ భద్రత లేక బీతిల్లిపోతున్నారు కొందరు. చదువు పూర్తి అయినా ఇంకా కొలువు తీరక అక్కడ పని దొరకక వెతలు పడుతున్న వారెందరో....ఉత్తచేతులతో ఇంటికి రాలేక విదేశాలలో ఉద్యోగం లేక తెచ్చిన బ్యాంకు ప్రైవేట్ అప్పులు భారంగా భావించి మానసిక ఒత్తిడితో బాధపడుతూ బతుకు జీవుడా అని విదేశాలలో కాలం వెల్లదీస్తున్న యువత మరికొందరు. ఒకరి తో ఇంకొకరికి సంబంధం లేకుండా బాధలు అనుభవిస్తూ పనిచేసుకొంటూ చాలిచాలని జీతంతో జీవితం గడుపుతున్నారు. తల్లిదండ్రులను పైసలు పంపించండి అని అడగలేక అక్కడ పని దొరకక వెతలు పడుతున్న పిల్లల బాధలు తెలుసుకొని తెలిసినా తెలియనట్టు తల్లిదండ్రులు లోలోన మనసులో మదనపడుతూ కుమిలిపోతున్న కన్నతల్లిదండ్రులు మరికొందరు. విదేశీయుల రాకతో స్తానికంగా ఉద్యోగ అవకాశాలు లేకుండా దేశీయులు నష్టపోతున్నాము అని జాతిభేదాలతో రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారు అక్కడ నాయకులు. దానిలో ప్రథముడు డోనాల్డ్ ట్రంప్ ఒకరు .దీనిని అదునుగా చూసుకొని కొందరు సంఘవిద్రోహ శక్తులు జాతి విభేదాలు సృష్టించి కాల్చిచంపడం,హత్యచేయటం సంఘటనలు జరుగుతున్నాయి. విదేశీయులు వెళ్ళిపోవాలి అని ఇటీవల లండన్ లో బారీ ర్యాలీ జరిగింది. అక్కడి నాయకులు కూడ దేశీయచట్టాలు మార్పు చేస్తున్నారు. స్వదేశీయులకు అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు.మన వారు బయట తిరగడానికే భయపడుతున్నారు. దేశీయ స్వప్రయోజనాలు మాకు ముఖ్యం అని నీతిసూత్రాలు పలుకుతూ దేశీయ రాబడి పెంపుకు విదేశీయులను నుంచి ఫీజుల రూపంలో దండిగా రాబట్టు కొంటున్నారు. .కాలేజి ఫీజులు పదిరెట్లు పెంచి విదేశీయుల రాబడితోనే నడుపుతున్న కాలేజీలెన్నో... ఉద్యోగ మోజులో బ్రోకర్ వ్యవస్థను ఆశ్రయించి వారిద్వార జీవితకాలం ఆదాయం దారబోస్తూ తప్పుడు పత్రాలతో పట్టు పడుతున్నావారు కొందరు.



ఇదంతా తెలిసినా లక్షలు వెచ్చించి ఉన్నత విద్యకొరకు వెళ్ళి ఉద్యోగం సంపాదించలేక వీసా గడువు ముగుస్తున్నా అక్కడే ఉండి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ పెట్రోల్ బంకులలో, మాల్స్ లలో హోటల్లో , వీది షాపులలో పనిచేస్తూ జీవితం గడుపుతున్నారు. ఇదంతా తెలిసినా ఇంకా అక్కడే ఉండటం వెనుక ఒకే ఒక్క కారణం ఉద్యోగం రాకపోతుందా అన్నా చిరుఆశ. ఒకేఒక్క చిన్న ఆశతో విదేశాలలో బతుకుతున్నారు.ఇట్టి విశయాలు తల్లిదండ్రులకు పూర్తిగా తెలియకుండా కొన్ని నిజాలు దాచిపెట్టి పిల్లలు అక్కడ ఉంటున్నారు. అయితే సోషల్ మీడియా ,టీవీ, పత్రికలు విదేశాలలో విద్యార్థులు, విదేశీయులు పడుతున్న వెతలు కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నారు. టీవీలు అదేపనిగా ఇట్టి వీషయాలపై ఊదరగొట్టి తల్లిదండ్రులను గందరగోళంగా ప్రశాంతంగా ఇక్కడ పిల్లల తల్లిదండ్రులు ఉండలేక పోతున్నారు. దీనివలన తమ పిల్లలు ఎలా ఉన్నారో ,ఏలాంటి అగాయిత్యాలకు పాల్పడతారో,ఏ సంఘవిద్రోహ శక్తుల బారినపడి తమ పిల్లలకు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందో, పిల్లలు మానసిక వత్తిడికి లోనై చెడు అలవాట్లకు బానిసలుఅవుతాడో అని తమ కొడుకు పై ఉహాజనితంగా నాకొడుకు ఎక్కడ చెడిపోతాడోఅని మానసికంగా తల్లిదండ్రులు ఒత్తిడితో ఉంటున్నారు. బిక్కు బిక్కు మంటు బతుకు జీవుడా అని జీవితం గడుపుతున్న తల్లిదండ్రులు ఎందరో. పిల్లలు సెటిల్ అవ్వక ,సెటిల్ అయిన పిల్లలు ఉద్యోగ భద్రత లేక పెండ్లిల్లకు దూరంగా ఉంటున్నారు. ఇండియా కు రాకుండా, పెండ్లి చేసుకోక తాతలు, అమ్మమ్మలుగా చూడాలనుకొనే కొందరికి ఆశలు నెరవేరడంలేదు.మావాడు అమెరికా లో ఉన్నాడు అని ఏ ఒక్కరు దైర్యం గా చెప్పుకొనే పరిస్థితి ఈనాడు లేదు. దీనికి కారణాలు ఏమీటి అని తల్లిదండ్రులు, ప్రభుత్వాలు అన్వేషించాలి. ప్రభుత్వాలు కూడ దూరదృష్టితో ప్రణాళికలు రచించాలి. విదేశీ చదువులు నేరంకాదు.కాని అక్కడ చదువు లతో ఇక్కడికి వచ్చి ఉద్యోగం చేసుకొనేలా , స్వతంత్రంగా జీవించే మార్గాలు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలి. విదేశీ ప్రమాణాల తో వారి ప్రతిభను మన దేశంలోనే ఉపయోగ పడేలా దేశ ప్రగతి కి బాటలు వేసేలా విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించిన నాడు యువత విదేశీ బాటపట్టకుంటా ఉంటారు.ఒక వేళ్ళ వెళ్ళినా భరోసాగా స్వదేశానికి తిరిగి రావాలి .ఆనమ్మకం ప్రభుత్వం యువతకు కల్పించాలి.మన దేశంలో లోనే యువత భరోసాగా జీవించ గలిగే రోజులు రావాలని ప్రభుత్వాలు ఆదిశగా ఆలోచించాలి.

- లొడిగ. వెంకన్నయాదవ్
సామాజిక వేత్త

ఇంటింటా సంబరాలు
బతుకమ్మల ముచ్చట్లు
మగువల హృదయాలలో
ఆనందపు హరివిల్లులు

గునుగు పూల గుబాళింపు
తంగేడు పూల పరిమళాలు
కలగలిసిన ప్రతిరూపం
బతుకమ్మ ఆరాధ్య దైవం

గౌరీ, దుర్గావతారంగా
భక్తితోడ కొలుస్తారు
మహిమాన్వతమైన తల్లి
బంగరు బతుకమ్మ తల్లి

చామంతులు బంతిపూలు
మందారపూలు గన్నేరులు
మల్లె మొల్ల విరజాజులతో
బతుకమ్మల సోయగాలు

రకరకాల రంగులు, పూలతో
రంజిల్లును బతుకమ్మలు
అనునిత్యం ఆహ్లాదకరం
నవరాత్రుల పర్వదినం

నిత్యం పూజలు ఆటలు
హారతులూ నివేదనలు
చప్పట్లువేస్తు తాళాలతో
పాడే ఊయల పాటలు

పట్టు పీతాంబరాలు
పరికిణీలు వస్త్రాలు
పసిడి ఆభరణాలతో
పడతుల సందళ్ళు

బతుకమ్మల ఆటలతో
ఆడపడుచు ముచ్చట్లు
పరవశించు పాటలతో
అలరింతురు స్త్రీలందరు

ఆత్మీయత అనుబంధం
కలబోసినట్టి పర్వదినం
అందరినీ ఒకటి చేయు
బతుకమ్మల సంబరం

నవరాత్రుల వేడుకలు
ఊరూరా ఉత్సవాలు
భక్తితో పూజలు భజనలు
ప్రసాదాలు నివేదనలు

బతుకమ్మా బతుకమ్మా
బంగారు బతుకమ్మా
భక్తితో ప్రణమిల్లెదము
భక్తుల కాపాడుమమ్మ

- నాగరాజు కామర్సు
(92480 93580)

## హైటెన్షన్ విద్యుత్ లైన్ వద్దు



### రైతులు అర్ధనగ్నంగా నిరసన

**ఆమనగల్లు, మహా:** 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ వద్దు అంటూ కడ్తాల్ మండలం హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. గత 15 రోజులుగా నిరసన దీక్ష ద్వారా తమ అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తున్న కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలైన్మెంట్ మార్చకపోతే రైతులకు చావే దిక్కు అవుతుందన్నారు.బీదర్ నుంచి మహేశ్వరం వరకు నిర్మిస్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ మార్గంతో కడ్తాల్ తో పాటు పరిసర గ్రామాల వ్యవసాయ పొలాల మీదుగా స్తంభాలు వైర్లు వెళ్లడం ద్వారా సుమారు 3000 ఎకరాల వ్యవసాయ భూమి నిరుపయోగంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను ముందే గ్రహించిన రైతులు అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్న సమస్యకు పరిష్కారం లభించడం లేదని కడ్తాల్ జాతీయ రహదారిపై 15 రోజులుగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తునామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నిరసనకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సంఘీభావం తెలిపారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ధికోసం అలైన్మెంట్ మార్పు

### మొదట ప్రతిపాదించిన అలైన్మెంట్ను అమలు చేయాలి.. ఆమనగల్లు లోరీజినల్ రింగ్ రోడ్ భూ నిర్వాసితుల భూ అవగాహన సదస్సు

**ఆమనగల్లు, మహా:** మొదట ప్రతిపాదించిన అలైన్మెంట్ను అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జగ్గారెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు సోమవారం అమనగల్లు పట్టణంలోని వెంకట నరసింహ గార్డెన్ లో కానుగుల వెంకటయ్య ఆధ్వర్యంలో రీజినల్ రింగ్ రోడ్ భూ నిర్వాసితుల భూ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు ఈ సదస్సుకు మాడుగుల,ఆమనగల్లు,తలకొండపల్లి మండలాల నుండి పెద్ద ఎత్తున భూ నిర్వాసిత రైతులు హాజరయ్యారు. కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ భూస్వాముల భూములను కాపాడడం కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ధి కోసం ప్రభుత్వం అలైన్మెంట్ మార్చిందని అన్నారు. రింగ్ రోడ్డు అంటే రింగు లాగా ఉండాలి కానీ వంకర వంకరలుగా ఎందుకు మారిందో ఎవరి ప్రయోజనాల కోసం మారిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. వంశపారంపర్యంగా తరతరాలుగా వ్యవసాయం మీదనే ఆధారపడుతూ జీవనం కొనసాగిస్తున్న సన్న చిన్నకారు పేద రైతుల భూములను ప్రభుత్వం లాక్కోవడం అన్యాయమని,రైతు నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ గతంలో రైతు పోరాటాలు ఢిల్లీ పీఠాన్ని కదిలించే ఉద్యమాలను రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోవద్దని, రైతాంగం తలుచుకుంటే ప్రభుత్వాలే కూలిపోయినటువంటి చరిత్ర ఉందని వివరించారు. తెలంగాణ అంటేనే పోరాటాల అడ్డా అని జమీందారులకు రజాకార్లకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలు నిర్వహించిన చరిత్ర రైతులకు ఉన్నదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షాన నిలబడే వ్యక్తి అయితే తక్షణమే పేద రైతుల భూములను కాపాడాలని అన్నారు. ధర్మమనేది మన వైపు ఉంది అధర్మం ఎంతో కాలం నిలబడదు... మీరు చేస్తున్న ఈ పోరాటానికి రైతు సంఘం ఎల్లవేళలా ముందు ఉండి పోరాటం చేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రక్షణగా ఉండకుండా పెట్టుబడిదారులకు మద్దతుగా నిలబడుతున్నాయని, ఐనా సరే రైతులు ధైర్యంగా నిలబడాలని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఐక్య కార్యచరణతో తిప్పి కొట్టాలని, మనభూమి మనకు దక్కేవరకు పోరాటాలు నిర్వహించాలని సూచించారు. మన ఐకమత్యమే మన భూములను కాపాడుతుందని రైతులందరూ ఐకమత్యంతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రతి రాజకీయ నాయకుడు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లబ్ది పొందడం కోసం కృషి చేస్తున్నారనీ, రైతుల పక్షాన నిలబడే పరిస్థితి లేదని, అందుకే రైతులను విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక రామచందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య , రైతు సంఘం నాయకులు ఎమ్ యాదయ్య గుమ్మడి కురుమయ్య,పిప్పళ్ల శివశంకర్ భూ నిర్వాసితుల పోరాట కమిటీ అధ్యక్షులు దొడ్డి పరమేష్, భూ నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు గడిగ వెంకటస్వామి, పబ్బతి శ్రీను, సంజీవరెడ్డి, జైపాల్ రెడ్డి, లక్ష్మయ్య,జంగారెడ్డి, కొత్తపల్లి రాములు, శ్రీనివాస్ భూ నిర్వాసిత రైతులు నరసింహ, శంకర్,ఆరోగ్య రెడ్డి, అంజి,వెంకటేష్ మాధవరెడ్డి నరసింహ శంకరయ్య గౌడ్, యాదయ్య, చిట్టెమ్మ, రాములమ్మ ,నిర్మలమ్మ ,సువర్ణ ,ఎల్లమ్మ ,రామచంద్రయ్య,తిరుపతయ్య, స్వామి, రమేష్, కళ్యాణ్ నాయక్,శంకర నాయక్, యాదగిరియాదవ్,శ్రీకాంత్,శివ,కరుణలత,విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణిలోని ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వరపరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 40 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





### ఎమ్మెల్యేపై అనుచిత పోస్టులు.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ఆమనగల్లు, మహా :** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై వాట్సప్ గ్రూప్లో అనుచిత పోస్టులు,వీడియోలు పెడుతున్న వ్యక్తిని అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం అమనగల్లు పోలీస్ స్టేషన్ 1oలో ఫిర్యాదు చేశారు.నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులనుచూసి ఓర్వలేక ఇలాంటి పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో విజయరాథోడ్,హరిలాల్, సురేశ్ నాయక్, రాజ్ కుమార్ ఉన్నారు.

## సబియా సుల్తానాకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసిన కేశంపేట మండల మాజీ జడ్పీటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

**షాద్ నగర్, మహా:** దివంగత న్యాయవాది తాండ్ర వీరేందర్ రెడ్డి అంటే షాద్ నగర్ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులకు ఒక ప్రత్యేకమైన అభిమానం, గౌరవం ఉండేది. ఆయన మహిళా న్యాయవాదుల పట్ల చాలా హుందాగా గౌరవంగా ప్రవర్తించే వారిని మహిళా న్యాయవాదులు అంటూ ఉంటారు. జూనియర్ న్యాయవాదులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు మరియు ప్రోత్సాహం అందించేవారు తాండ్ర వీరేందర్ రెడ్డి. తండ్రికి తగ్గట్టుగానే కుమారుడు శ్రవణ్ రెడ్డి కోడలు విశాల ఫోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన మహిళ న్యాయవాది సబియా సుల్తానాను ప్రత్యేకంగా కలుసుకొని శాలువాతో సన్మానించి సత్కరించి, గుర్తుగా ఒక పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా మాట్లాడుతూ దివంగత సీనియర్ న్యాయవాది తాండ్ర వీరేందర్ రెడ్డి అంటే తనకు ఒక ప్రత్యేకమైన అభిమానమని, న్యాయ రంగంలో నిష్ణాతులైన వీరేందర్ రెడ్డి ఎప్పుడూ మంచి మంచి సలహాలు ఇచ్చే వారిని, ఒక పెద్ద మనిషిగా హుందాతనంగా వ్యవహరిస్తూ అందరి పట్ల గౌరవంగా ఉండే వారిని, తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డిలు తనను సన్మానించడం పట్ల నిజంగా వీరేందర్ రెడ్డి గారే సన్మానించినట్టు ఉందని సంతోషపడ్డారు. ఈ అద్భుత క్షణాలు జీవితంలో మరువలేనివని తనను సన్మానించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.







### దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మహాదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో సరస్వతి అమ్మవారు, శుభానంద దేవి ఆలయాల్లో పుణ్యాహవాచనం గణపతి పూజ మంటపారాధనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ అర్చకులు ప్రారంభించారు. కాటారంలో మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనం లో దుర్గామాత విగ్రహాన్ని ఉంచి గారేపల్లి వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవాల మండపంలో దేవి మాత ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టాపన పూజ చేశారు. వేద బ్రాహ్మణులు వేదాంతం గణేష్ శర్మ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాలా త్రిపుర సుందరి దేవి గా అమ్మవారు దర్శనమిచ్చారు. గండాదీపారాధన. కలశారాధన, నవగ్రహ పూజ, దేవి మాతకు అభిషేకం, లలితా సహస్రనామార్చనతో కుంకుమ పూజలు జరిగాయి. మండలంలోని ధన్వాడ గ్రామంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కుటుంబం ఆధ్వర్యంలో నిర్మాణమైన శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దుర్గాదేవి మాత ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు శ్రీరాంభట్ల కృష్ణమోహన్ శర్మ ఆధ్వర్యంలో గారెపల్లి గ్రామం నుండి ఉత్సవ విగ్రహాన్ని వాహనంలో ఊరేగింపుగా ధన్వాడ గ్రామానికి తీసుకువెళ్లారు. దుర్గాదేవి ప్రతిష్టాపన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదం వితరణ చేశారు. భూపాలపల్లి మంజూరునగర్ లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గండ్ర జ్యోతి దంపతులు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాలలో అమ్మవారు తొమ్మిది రూపాలుగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజులు రోజు పోటీలు అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు.

## యాచారం దవఖానాలో స్వచ్ఛభారత్ కార్యక్రమం

### బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయ




**రంగారెడ్డి జిల్లా మహా:** రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు యాచారంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని విజయ్ నాయక్ అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని, రాష్ట్ర పార్టీ ఇచ్చిన వివిధ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం, బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో, సోమవారం రంగారెడ్డి జిల్లా, యాచారం మండల కేంద్రంలోని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వాటర్ ట్యాంక్ పరిసరాలలో శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరుపుల విజయ నాయక్ మాట్లాడుతూ దేశ ప్రజల శ్రేయస్సు కోరే ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా, స్వచ్ఛభారత్ నిర్వహించడం సంతోషంగా ఉందని, ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకొని కార్యక్రమాన్ని చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇట్టి కార్యక్రమంలో మాజి అధ్యక్షులు తాండ్ర రవీందర్, బిజెపి సీనియర్ నాయకులు గోగికర్ రమేష్, ఆంబోజి జగదీశ్ యాదవ్, రాయకంటి విజయ్ కుమార్, దేవరకొండ ఈశ్వర్, నారిమల్ల రమేష్, గొరిగే బీరప్ప, పుప్పాల శాంతి కుమార్, నడుకుడి కృష్ణ, పల్లపు నరేష్, కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్ రెడ్డి, పల్లపు రవి, పల్లపు విజయ్, జపాలా శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.



### ఆపత్కాలంలో ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన కోరే లింగప్పఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాబా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 32 వేల చెక్కు మంజూరైంది. సోమవారం బాధిత కుటుంబానికి చెక్కును బాబా అందజేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదుకుంటుందన్నారు.

## ఫిలిం సిటీ ఆధీనంలో పేదల ఇంటి స్థలాల భూమి



### స్థానిక ఎమ్మెల్యేను కలిసిన సిపిఎం నాయకులు లబ్ధిదారులకు న్యాయం చేస్తా... ఎమ్మెల్యే

**రంగారెడ్డి జిల్లా మహా:** రామోజీ ఫిలిం సిటీ ఆధీనంలోని ఇండ్ల స్థలాల గురించి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన సిపిఎం నాయకులు. రాష్ట్ర నాయకులు కావలి నరసింహ మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2007లో ఇందిరమ్మ పేరు మీద, 650 పైగా ఇండ్ల పట్టాలను పోల్కంపల్లి, రాయపోలు, ముకునూరు, నాగన్ పల్లి గ్రామాల పేద ప్రజలకు మంజూరు చేయడం జరిగింది. ఈ యొక్క ఇంటి స్థలాలకు కేటాయించిన భూమి, రామోజీ ఫిలిం సిటీ ఆధీనంలో ఉండడంతో, పట్టా సర్టిఫికెట్లు పొందిన ప్రజలని లోనికి రానివ్వకుండా, రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం కంచ వేసి అడ్డుకుంటున్నారు. దాదాపుగా 18 సంవత్సరాల నుండి ఫిలిం సిటీ ఆధీనంలో ఉన్న భూమిలోకి లబ్ధిదారులను రానివ్వడం లేదు. ఈ సమస్యపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి, ఫిలిం సిటీ యాజమాన్యం కబ్జా చేసిన, ఇండ్ల స్థలాల గురించి విన్నవించడం జరిగింది. ఫిలిం సిటీ వారి నుంచి తప్పకుండా త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని నరసింహ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి సురేష్, సహాయ కార్యదర్శి జంగిలి ప్రవీణ్ కుమార్, మాజీ కార్యదర్శి ములుగు నరసింహ, నాయకులు బండ నరసింహ, లబ్ధిదారులు పాల్గొనడం జరిగింది.

## యువత స్వయంకృషితో ఎదగాలి.. సబితా ఇంద్రారెడ్డి



**ఆమనగల్లు, మహా:** యువత స్వయంకృషితో ఎదగాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల మండల కేంద్రంలో ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీమంత్రి సబిత ఇంద్రారెడ్డి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు యువత స్వయంకృషితో ఎదగాలని ప్రభుత్వ ఉద్యోగాల మీద ఆధారపడకుండా ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, మహేష్, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



### అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

**ఆమనగల్లు, మహా:** మాడ్గుల మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సిఐ వేణుగోపాల్ చెప్పారు. శివారులో గస్తీ నిర్వహిస్తుండగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి యజమానుల కేసు నమోదు చేసినట్లు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నేషనల్ హైవేల భూసేకరణ దసరాలోపు పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

**భూపాలపల్లి, మహా :** జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసులు పరిష్కార ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ రామకృష్ణా రావు, ఆర్ అండ్ బి కార్యదర్శి వికాస్ రాజ్ లతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పనులు వేగవంతం చేయుటపై ముఖ్యమంత్రి పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం చేశారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని, జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 130 హెక్టార్లలో భూమి అవసరం ఉందని, దానిలో 117.97 సేకరణ పూర్తి అయిందని, పెండింగ్ ఉన్న 12.3 హెక్టార్ల భూ సమస్య ఉందని, ఇందులో 7.79 హెక్టార్ల భూమి కోర్టు కేసుల్లో ఉందని, మిగిలిన 6.02 హెక్టార్ల భూమికి టైటిల్ సమస్యలు ఉన్నందున, నిధులు డిపాజిట్ చేసి భూ సేకరణ పూర్తి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్ అండ్ బి డిఈ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సహాయం



**ఆమనగల్లు, మహా :** కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన గొల్లపల్లి నర్సింహా అనే వ్యక్తి ఇటీవల అకస్మాత్తుగా మరణించాడు. విషయం తెలుసుకున్న విషయం మాజీ ఎంపిటిసి అద్దాల రాములు,గ్రామ యువ నాయకులు మహేందర్ గౌడ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని వారికి ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.,ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో తాటిపర్తి ఈశ్వర్ యాదవ్, ఆంజనేయులు, యాదయ్య, బాలకృష్ణ, రాము గౌడ్,మహేందర్, రాజీవ్,రమేష్, సత్తయ్య, రాజు,వెంకటేష్,లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మినీ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్, మహా:** రంగా రెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో యువతను ప్రోత్సహించే లక్ష్యంతో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఎమ్మెల్యే శంకర్ బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడం ఎంతో సంతోషకరమని అన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా జీవితంలో చాలా ముఖ్యమైనవని, అవి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవడం ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని ఆయన సూచించారు. గెలుపు, ఓటములు క్రీడలో సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా మరింత కష్టపడి ముందుకు సాగాలని క్రీడాకారులకు అన్నారు. క్రీడలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# బైకు దొంగల ముఠా అరెస్ట్

## ఐదు బైక్‌లు స్వాధీనం

**రాజేంద్రనగర్, మహా ;** ఇంటి ముందు పార్కు చేసిన బైక్ లను దొంగిలిస్తున్న దొంగల ముఠాను శంషాబాద్ పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 19న పాలమాకుల గ్రామానికి చెందిన సారా రాకేశ్ ఇంటి ముందు పార్క్ చేసిన స్ప్లెండర్ బైక్ (టీఎస్ 07ఎఫ్. జె 4226) ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. మియాపూర్ కి చెందిన ఇద్దరు నిందితులు సంతోష్ దాస్ (కుమార్), రాఘవేంద్ర (పండు), మైలారం శివ కుమార్ అను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి స్ప్లెండర్ బైక్ ను, ఇతర పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలించిన 04 బైక్ లను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జుడీషియల్ రిమాండ్ చంచల్ గూడ జైలుకు తరలించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ తో పాటు, ఇతర పోలీస్ స్టేషన్ లో కూడ బైక్ దొంగతనం కేసులు ఉన్నవి అని పోలీసుల విచరణలో తెలిపారు. విచారణలో ప్రతిభ కనబరిచిన నరసింహా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ ని, పోలీస్ స్టేషన్ సిబ్బంది విజయ్ కుమార్, ప్రేమ్ కుమార్ రెడ్డి లను శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, అభినందించారు.

# వరంగల్ తూర్పులో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

## 50 మైనారిటీ కుటుంబాలు బిఆర్ఎస్‌లో చేరిక



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ చరిత్రలో ఓ విప్లవత్మక మార్పు చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎదురుచూసిన కళ్లు చెమ్మగిల్లాయి. ఒక్కసారిగా వరంగల్ తూర్పు నియోజకవర్గం లో మైనార్టీలు, నాయకులు గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీశాసనసభ్యులు నన్నపునేని నరేందర్ గతంలో చేసిన అభివృద్ధి చూపిన అభిమానం గుర్తుకు వచ్చి దాదాపు 50 మైనారిటీ కుటుంబాలు బి ఆర్ఎస్ లో చేరారు. నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించబడింది. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ ఇకపై వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరదలచిన ప్రతి ఒక్కరూ, ఆయా డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమిష్టి తీర్మానం మేరకే పార్టీలో చేర్చబడతారని స్పష్టంచేశారు. పార్టీలో చేరిన నాయకులకు కార్యకర్తలకు ఉన్నత గౌరవం లభిస్తుందని వ్యక్తిపరమైన ఆధిపత్యం తగ్గి సమిష్టి బలం పెరుగుతుందని ఆయన తెలిపారు. వరంగల్ తూర్పు నుండి ప్రారంభమైన ఈ విప్లవాత్మక మార్పు కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో సరైన న్యాయం జరుగనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్న సత్యానికి నిలువెత్తు నిదర్శనం బీఆర్ఎస్ పార్టీ అని ఈ సందర్భంగా నరేందర్ అన్నారు. లపై నిర్ణయాల ప్రకారం 41 డివిజన్లోని ముఖ్య కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని కొత్తవారిని గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# బాల త్రిపుర సుందరి దేవిగా కొలువుదీరిన దుర్గాదేవి

- జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో రద్దీ
- విద్యుత్ కాంతులతో మండపాల అలంకరణ
- ఇబ్రహీంపట్నంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



**మహా:** దుర్గాదేవి దుష్టశక్తులను అంతమొందించి, ప్రజల జీవితంలో భయాన్ని పోగొట్టే శక్తివంతమైన దేవతగా ప్రజల జీవితాలలో నిలిచిపోయింది. ఈ సందర్భంగా భక్తులు ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో అమ్మవారిని పూజించడం జరుగుతుంది. సోమవారం జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో రద్దీ కొనసాగింది. బాలా త్రిపుర సుందరి దేవిగా కొలువుదీరిన దుర్గాదేవి... సోమవారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని, శేరిగూడ గ్రామంలో, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి సమక్షంలో ఏర్పాటుచే సిన మండపంలో కొలువుదీరిన అమ్మవారికి, మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించి అమ్మవారి యొక్క ఆశీస్సులు పొందారు. ఈ యొక్క పూజా కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి రెడ్డి, డైరెక్టర్ మొద్దు కరుణాకర్ రెడ్డి, భక్తులు పలువురు పాల్గొన్నారు.

**మహిషాసురుడికి మరణం లేని వరం...**


మహిషాసురుడి అదే రాక్షసుడు బ్రహ్మను స్మరిస్తూ తపస్సు చేసి చేయడంతో ప్రత్యక్షమైన బ్రహ్మ ప్రపంచంలో తనకు మరణం లేని వరం ప్రసాదిస్తాడు. ఈ వరంతో ముల్లోకాల ను శాసించాలని అహంకారంతో దేవతలను ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవాడు. దీంతో దేవతలందరూ లోకానికి శాంతి చేకూరాలని బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కలిసి మహిషాసురుని అంతమొందించడానికి, పరాశక్తిని సృష్టించి, ఆమె ద్వారా మహిషాసురుని అంతమొందించి లోకానికి శాంతిని నెలకొల్పడంతో దుర్గ దేవిగా ఆమెను కొలుస్తారు.

**దేవతలకు అభయం ఇచ్చిన దుర్గాదేవి...**

దేవతలను భయభ్రాంతులకు గురిచేసిన మహిసాసురుడు వంటి రాక్షసుడిని అంతమొందించడానికి, దేవతలకు అభయం ఇచ్చిన దుర్గాదేవి, ఒక శక్తిగా ఉగ్రరూపంతో తన సింహ వాహనంపై కూర్చుని యుద్ధానికి వెళ్లి, రాక్షసులను ఓడించి విజయం సాధించడంతో తన కోపాన్ని శాంతిపరచడానికి నాటి నుంచి విజయ దశమి పండుగ జరుపుకుంటారు. ఈ సందర్భంగా 10 రోజులపాటు శరన్నవరాత్రులు జరుపుకుంటూ, అమ్మవారిని పదిరూపాలలో భక్తిశ్రద్ధలతో నిష్ఠ నియమాలతో పూజలు చేసి ఆమె ఆశీర్వాదం పొందుతారు.

# భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు శరవేగంగా చేపట్టాలి


## తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**మంచిర్యాల, మహా:** జాతీయ రహదారుల నిర్మాణాలలో భాగంగా భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ శరవేగంగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ రహదారులు, అటవీ, ఇతర ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, అదనపు కలెక్టర్లు (హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్), హైదరాబాద్ విజయవాడ 6 వరుసల జాతీయ రహదారి 65 రోడ్డు పనులు, హైదరాబాద్ నుండి అమరావతి, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్, హైదరాబాద్ శ్రీశైలం 4 వరుసల జాతీయ రహదారి 765 రోడ్డు పనులు, జాతీయ రహదారి 163 మన్నెగూడ సెక్షన్ 4 వరుసల రోడ్డు, హైదరాబాద్ మంచిర్యాల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ శరవేగంగా చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ భూసేకరణ పూర్తి చేయాలని వెల్లడించారు. జాతీయ రహదారి 163జి పరిధిలో పెండింగ్ లో ఉన్న 130 హెక్టార్ల భూ బదలాయింపు ప్రక్రియ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అన్నారు. రహదారి పరిధిలో ఉన్న జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని వివరించారు. భూసేకరణ ప్రక్రియలు కలెక్టర్లు నేరుగా రైతులతో చర్చించాలని చెప్పారు. భూ నిర్వాసితులకు జాతీయ రహదారుల సంస్థ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. రహదారుల నిర్మాణాలలో అవసరమైన అటవీ శాఖ అనుమతులు, కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి సంబంధిత యజమానులకు నష్టపరిహారం అందించాలని కోరారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రహదారులు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రపతి పేరిట ముటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ శాఖలోని వన్యప్రాణి సంరక్షణ పరిధిలోని రాని భూములకు సంబంధించి అనుమతులను త్వరగా మంజూరు చేసేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ భూములకు బదులుగా అటవీ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి పరిధిలో 3వ విడత ఆర్బిట్రేషన్ కొరకు దాఖలు చేసిన 114 కేసులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి 63 కు సంబంధించి జిల్లాకు చెందిన 17 గ్రామాలలో కోర్టు స్టే కలిగిన గ్రామాలను మినహాయించి మిగిలిన గ్రామాలలో అవార్డు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 30వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్డు విస్తరణకు బెల్లంపల్లి పట్టణ ప్రజలు సహకరించాలి

## మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న రోడ్డు విస్తరణకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం రోజు మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. మొదటి దశలో కాల్ టెక్స్ ఫ్లైఓవర్ నుండి కాంటా చౌరస్తా వరకు 100 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో భాగంగా రోడ్డును ఆనుకొని ఉన్న వ్యాపారులకు ఇంటి యజమానులకు నోటీసులు సైతం మున్సిపల్ శాఖ తరపున అందజేశామని స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు మార్కింగ్ సైతం ఏర్పాటుచేసి ప్రజలకు సూచించామని తెలిపారు. టి యు ఎఫ్ ఐ డి సి పథకం కింద 6.7 కోట్ల రూపాయలతో రోడ్డు విస్తరణ కార్యక్రమానికి నిధులను కేటాయించడం జరిగిందని 2022వ సంవత్సరంలోనే రోడ్డు విస్తరణ పనులు మంజూరు కాగా అనివార్య కారణాలరీత్యా వాయిదా వేయడం జరిగిందని ప్రస్తుతం రోడ్డు నిర్మించేందుకు సిద్ధమయ్యామని తెలిపారు. రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు మార్కింగ్లను సైతం ఏర్పాటు చేసి సంబంధిత యజమానులకు వ్యాపారులకు నోటీసులు అందజేయగా అందులో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందని కోర్టు తీర్పు అనంతరం రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు .రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని ఆపివేసేందుకు కొంతమంది దళారులు వ్యాపారుల వద్ద నుండి నిధులను సేకరిస్తున్నట్టు సమాచారం తెలిసిందని రోడ్డు విస్తరణ కార్యక్రమంలో దళారులను నమ్మవద్దని రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని అప్రదిష్ట పాలు చేసేందుకు ప్రయత్నించే దళారులను గుర్తించి తమకు తెలిపినట్లైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పనిభారం తగ్గించాలి

## ఏఐటీయూసీ

**ఆదిలాబాద్ మహా:** మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి.. వారిపై పని భారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పలు విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ...మున్సిపల్ కార్మికులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి 2 జతల యూనిఫాం, కుట్టుకూలీ ఇవ్వాలని,గ్లౌజులు, గమ్ బూట్లు ,సబ్బులు, నూనె, బెల్లం ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్నఏరియర్స్ కూడా విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో యూనియన్ తరపున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మంతెన కాంతరావు, చీరంజీవి, నారాయణరెడ్డి, ఉశన్న, సురేష్, లక్ష్మీ, యాదగిరి, శాంత, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

# భీమారం ప్రజలకు చెంతకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద



**భీమారం /మంచిర్యాల, మహా :** భీమారం మండల ప్రజలకు చేరువలో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్ మోహన్, మండల తహసీల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈరోజు ఈ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని వెల్లడించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒకటొకటిగా నెరవేరుస్తున్నామని వివరించారు. 15వ ఆర్థిక ప్రణాళికలో 1 కోటి 43 లక్షల రూపాయల నిధులతో పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సి.సి. రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణకు చర్యలు తీసుకుంటూ, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు మంజూరు, సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. భీమారంలో 15 కోట్ల రూపాయలతో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. చెన్నూర్ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణంలో అవసరమైన అటవీ అనుమతులు పొంది పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి మండలాలలో పంట సాగుకు అవసరమైన 500 టన్నుల యూరియా అదనంగా అందిస్తామని తెలిపారు. రైతులు ముందస్తుగా రబీ పంట కోసం కాకుండా అవసరం మేరకు యూరియా వినియోగించుకోవాలని సూచించారు. రామగుండం ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 10వేల కోట్ల రూపాయలతో ఎరువుల పరిశ్రమను తిరిగి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలలో అవసరమైన యూరియా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో గత సంవత్సరం 4 వేల 800 కోట్ల రూపాయల లాభం రాగా ఈ సంవత్సరం 6 వేల 340 కోట్ల రూపాయలు లాభం వచ్చిందని వివరించారు. రెగ్యులర్ కార్మికులకు 34 శాతం బోనస్, ఒప్పంద కార్మికులకు 5 వేల 500 రూపాయల బోనస్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గ్రామీణ పేదల కొరకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా అంబులెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధులకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కృషి చేస్తామని, ఇందులో భాగంగా అవసరమైన ఫర్నిచర్, వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో నిపుణులైన వైద్యుల ద్వారా ప్రత్యేక వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు చెప్పారు saఅనంతరం మండలంలోని 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బయో వ్యర్థాల నిర్వహణ శ్రద్ధగా చేపట్టాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల, మహా:** మంచిర్యాల జిల్లాలో బయో వ్యర్థాల నిర్వహణ శ్రద్ధగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో బయో వ్యర్థాల నిర్వహణపై మున్సిపల్ కమీషనర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, వెంకటరమణ ఇన్సినరేటర్స్ ప్రతినిధులు, జిల్లా ఆసుపత్రి అధికారులు, తానా, తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారులతో జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బయో వ్యర్థాల నిర్వహణ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్ లు, డెంటల్ క్లినిక్ లు బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేయుట కొరకు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇలా నమోదు చేసుకోని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేయుటకు 3 రంగులతో బకెట్లను ఏర్పాటు చేయాలని, పసుపు రంగు బకెట్ లో మానవ అవశేష వ్యర్థాలు, ఆపరేషన్ జరిగినప్పుడు తీసివేసిన భాగాలు, చీము, గడ్డలు, అంటువ్యాధులకు కారణమయ్యే వ్యర్థాలు, కాలం చెల్లిన మందులు, బ్లడ్ బ్యాగ్లు, ల్యాబ్ కల్చర్, స్పెసిఫిన్స్ వేయాలని, ఎరుపు రంగు బకెట్ లో ఐ.వి. సెర్ప్, బాటిళ్ళు, సిరంజ్లు, చేతి తొడుగులు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయాలని, నీలం రంగు బకెట్ లో వాడిన మెడిసిన్ వాయిల్స్, సూదులు, బ్లేడ్లు, లాన్సెట్స్ వేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో బయో మెడికల్ వ్యర్థాల నియమాలను పాటించాలని కోరారు. బయో మెడికల్ వ్యవస్థను వెంకటరమణ ఇన్సినరేటర్స్ కు అప్పగించాలని, అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేయుట కొరకు వెంకటరమణ ఇన్సినరేటర్స్, నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలితో సమన్వయం చేసుకోవాలని వివరించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా ఎలాంటి వ్యర్థాలను బయట పడవేయ్యరాదని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు నివేదించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమ సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృపాబాయి, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ సమన్వయకర్త రంజిత్ కుమార్, వెంకటరమణ ఇన్సినరేటర్స్ కరీంనగర్ సమన్వయకర్త తిరుపతి, ఐ. ఎం. ఎ. వైద్యులు డాక్టర్ సాల్మన్ రాజు, రవిప్రసాద్, శ్రీధర్, మున్సిపల్ కమీషనర్లు, ఎస్.ఓ. కాంతారావు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ డిఎస్పీ నళిని కలిసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ డిఎస్పి నళినిని సోమవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కలిశారు. ఈ సందర్భంగా రుమటాయిడ్ అర్థరైటిస్, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న,మాజీ డిఎస్పి నళిని జిల్లా కలెక్టర్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను, ఆమె యొక్క అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన ఆరోగ్యం గురించి వాకబ్ చేయగా, తాను ఎన్నో రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉన్నానని తెలిపారు. ప్రభుత్వము సహాయానికి సిద్ధంగా ఉందన్న విషయాన్ని నళిని కి వివరించిన కలెక్టర్. అల్లోపతి మందులు పడక పోవడంతో ఆయుర్వేద మందులను వాడటం వల్ల ఉపశమనం ఉందని కలెక్టర్ కు తెలిపారు. ఆరోగ్య పరిస్థితులు బాగుండాలని, ప్రభుత్వం నుండి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సర్వీస్ ఇష్యులు ఏమి ఉన్నా నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామన్న సీఎం గారి సందేశాన్ని నళిని గారికి తెలియజేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు.





# ప్రజాసేవకే పోలీసులు నిరంతరం కృషి

## దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి ..బెల్లంపల్లి రూరల్ సిఐ హనోక్

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణ సర్కిల్ పరిధిలోని ప్రజలు పండగ ఉత్సవాలను పురస్కరించుకొని సొంత ఊర్లకు పలు పట్టణాలకు పయనమై పోతున్న తరుణంలో తమ విలువైన వస్తువులను కాపాడుకు నేందుకు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి రూరల్ హనోక్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పండుగలను ఉత్సాహపూరితంగా నిర్వహించాలని తమ విలువైన బంగారు నగలు విలువైన ఆభరణాలు నగదులను బ్యాంకులో ఆఖరులలో దాచుకునేలా ఏర్పాటు చేసుకోవాలని దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. దసరా బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో సొంత గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు సమాయత్తమవుతున్న వేళ దొంగలు విలువైన వస్తువులను అపహరించేందుకు ప్రయత్నాలు చేస్తారని నూతన వ్యక్తులను అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సంబంధిత పోలీస్ శాఖ నిరంతరం ప్రజాసేవకు అంకితం అవుతారని పేర్కొన్నా రు దసరా సెలవులకు ఇంటికి వచ్చే విద్యార్థులు చెడువాసాలకు దూరంగా ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లల అలవాటులను నిశితంగా పరిశీలించాలని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును అప్రతిష్ట పాలు చేసుకోవద్దని ఆయన సూచించారు.








# మోదీ బయోపిక్..

## ఉన్ని ముకుందన్ బర్త్ డే స్పెషల్..

భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీవిత చరిత్ర వెండితెరపై ఆవిష్కృతమవుతోంది. 'మా వందే' పేరిట ఆయన బయోపిక్ తెరకెక్కుతోంది. ఈ మూవీలో మలయాళ హీరో ఉన్ని ముకుందన్.. మోదీగా నటించనున్నారు. క్రాంతి కుమార్ సీహెచ్ దర్శకత్వం వహిస్తుండగా వీర్ రెడ్డి.ఎం నిర్మిస్తున్నారు. ఇటీవల (సెప్టెంబర్ 17న) మోదీ బర్త్‌డే సందర్భంగా మా వందే ప్రాజెక్ట్ ప్రకటించారు. నేడు (సెప్టెంబర్ 22) ఉన్ని ముకుందన్ పుట్టినరోజు సందర్భంగా సినిమా నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు.

### మోదీ బయోపిక్..

ఇందులో మోదీ జనం ఎదుట స్టేజీపై నడుస్తున్నట్లుగా ఉంది. అతడి ఆశయాన్ని, సంకల్పాన్ని తల్లి ఆశీర్వదిస్తున్నట్లుగా పోస్టర్‌లో చూపించారు. ఈ మూవీలో మోదీ బాల్యం నుంచి నేటి వరకు జరిగిన ఎన్నో అంశాలను చూపించనున్నారు. వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని కీలక ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మోదీ ప్రపంచనాయకుడిగా ఎదగడం వెనక ఆయన మాతృమూర్తి హీరాబెన్ ప్రేరణ ఎంతో ఉంది. దీన్ని ఆధారంగా చేసుకుని.. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్ప బలం గొప్పదనే సందేశం ఇవ్వనున్నారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌తో పాటు దేశంలో ఉన్న అన్ని భాషల్లోనూ రిలీజ్ చేయనున్నారు.





# ఆ రోల్‌లో రణబీర్ కపూర్?

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి రూపొందిస్తున్న పాన్ వరల్డ్ సినిమా 'SSMB 29'పై ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ సినిమాలోని సెకండ్ హాఫ్‌లో ఓ స్పెషల్ ఎపిసోడ్ ఉందట. ఆ ఎపిసోడ్ కోసం ఓ స్పెషల్ రోల్‌ను రాజమౌళి డిజైన్ చేశారట. ఆ రోల్‌లో బాలీవుడ్ టాప్ హీరో రణబీర్‌కపూర్ కనిపిస్తారనేది ఈ వార్త సారాంశం. మరి ఇందులో వాస్తవం ఎంత ఉందో చూడాలి. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటులే కాక, హాలీవుడ్ నటులు కూడా భాగం అవుతుండటం విశేషం.

# దసరాకి పాట?



చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్‌లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే కొన్నిపాటలను సిద్ధం చేశారట భీమ్స్. ప్రమోషన్లలో భాగంగా దసరా సందర్భంగా 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి తొలిపాటను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వినాయక చవితి పండగని పురస్కరించుకుని ప్రత్యేకపోస్టర్‌ని విడుదల చేసిన యూనిట్.. ఇప్పుడు దసరాకి తొలిపాట రిలీజ్ చేసి, సినిమాపై మరింత క్రేజ్ పెంచాలన్నది ఆలోచనట. మరి... దసరా పండగకిపాట విడుదల చేస్తారా? లేదా? లేకుంటే మరేదైనా అప్‌డేట్ ఉంటుందా? అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహించిన 'విశ్వంభర' సినిమా 2026 వేసవిలో రిలీజ్ కానుంది.

# 8 ఏళ్లుగా నేనే ఎక్కువ ట్యాక్స్ కడుతున్నా!



దేశంలోని అత్యంత ధనిక నటుల్లో అక్షయ్ కుమార్ ఒకరు. ఒకానొక సమయంలో భారత్‌లో అత్యధిక మొత్తంలో ఆదాయ పన్ను చెల్లించి వార్తల్లోకెక్కాడు. నిజాయితీగా ట్యాక్స్ కట్టినందుకుగానూ ఆదాయపన్ను శాఖ ఆయనకు ప్రశంసాపత్రాన్ని సైతం అందించింది. అయితే అక్షయ్‌కు డబ్బుపిచ్చి ఉందన్న ప్రచారం జరిగింది. తాజాగా ద కపిల్ శర్మ షోకి హాజరైన అక్షయ్ మనీ మైండెడ్ అని తనపై పడిన ముద్రపై స్పందించాడు.

**రూ.100 కోట్లు ఎఫ్‌డీ చేస్తే..**

హీరో మాట్లాడుతూ.. జితేంద్ర సాహెబ్ రూ.100 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నాడని నేను ఎక్కడో వార్త చదివాను. నాకు బాగా గుర్తు.. అది చూశాక నేను మా నాన్న దగ్గరకు పరుగెత్తుకెళ్లాను. డాడీ, రూ.100 కోట్లు ఎఫ్‌డీ చేస్తే ఎంత వడ్డీ వస్తుంది? అని అడిగాను. అప్పట్లో ఇంట్రెస్ట్ రేట్ 13% ఉండేది. ఈ లెక్కన నెలకు రూ.1.3 కోట్లు అన్నాడు. అంటే నేను రూ.100 కోట్లు ఎఫ్‌డీ చేసుకోగలిగితే నాకు ఆర్థిక స్వేచ్ఛ లభించినట్లే అని ఫీలయ్యాను.

**ఆశకు హద్దు లేదు**

కానీ మనషుల ఆశకు అంతెక్కడిది? రూ.100 కోట్లు కాస్తా వెయ్యి కోట్లయితే బాగుండు..వెయ్యేందుకు? రూ.2 వేల కోట్లయితే బాగుంటుంది అనుకునేవాడిని. అలా మనలో డబ్బు ఆశకు అంతం లేదు అన్నాడు. మరి ఇప్పటివరకు ఎంత ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశావు? అని కపిల్ అడగ్గా.. అది నేను చెప్పనుగా అని తప్పించుకున్నాడు అక్షయ్.

**8 ఏళ్లుగా నేనే..**

ఆప్‌కీ అదాలత్ షోకి వెళ్లినప్పుడు కూడా అక్షయ్‌కు డబ్బు గురించే ప్రశ్న ఎదురైంది. అందుకీ బాలీవుడ్ స్టార్.. నేను కష్టపడి సంపాదించుకుంటున్నాను తప్ప ఎవరినీ దోపిడీ చేయడం లేదు కదా.. గత 8 ఏళ్లుగా ప్రభుత్వానికి నేనే ఎక్కువ ట్యాక్స్ కడుతున్నాను. అలా అని నేను మనీ మైండెడ్ అని అర్థం కాదు. బతకాలంటే డబ్బు అవసరం.


**నేనేమైనా దొంగతనం చేస్తున్నానా?**

నేను సంపాదిస్తున్నా.. ట్యాక్స్ కడుతున్నా, సేవ చేస్తున్నా.. సేవాగుణం నా మతం. అందరూ ఏమనుకుంటున్నారనేది నాకు అనవసరం. ఎవరైనా కార్యక్రమానికి రండి, డబ్బులిస్తాం అన్నారనుకోండి. తీసుకుంటే తప్పేంటి? మనమేం ఎవరి జేబులోనో చేయి పెట్టి దొంగిలించట్లేదు కదా! అని చెప్పుకొచ్చాడు. అక్షయ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ జానీ:LLB మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లు దాటేసింది.

## కాంతార ట్రైలర్ రిలీజ్ చేసిన ప్రభాస్



2022లో ఎలాంటి అంచనాల్లేకుండా వచ్చి బ్లాక్ బస్టర్ వసూళ్లు అందుకున్న సినిమా 'కాంతార'. దీని ప్రీక్వెల్‌ని 'కాంతార ఛాప్టర్ 1' పేరుతో తీశారు. రిషభ్ శెట్టి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించగా.. హొంబలే ఫిల్మ్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. అక్టోబరు 02న మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రభాస్ చేతుల మీదుగా తెలుగు ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే ఈసారి భారీతనం కనిపిస్తోంది కానీ ఓకే ఓకే అనిపించింది. రిషభ్ శెట్టి స్క్రీన్ ప్రెజెన్స్.. రుక్మిణి వసంత్ అందం ఎలివేట్ అయ్యాయి. విలన్ పాత్రలో గుల్షన్ దేవయ్య ఆకట్టుకునేలా కనిపించాడు. 'కాంతార' తొలి భాగంలో ప్రస్తుతం ఏం జరిగిందా అనే డ్రామాని సింపుల్‌గా చూపించారు. ఈసారి మాత్రం రాజులు, యుద్ధాలు, రాజకుమారితో హీరో ప్రేమలో పడటం ఇలా అన్ని కూడా భారీగానే సెటప్ చేశారు. మరి 'కాంతార' ఈసారి ఎలాంటి ఫలితం అందుకుంటుందో చూడాలి?



# గౌరవం కోసం పోరాటం

తమిళ అగ్ర నటుడు ధనుష్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటించిన విభిన్న కథాచిత్రం 'ఇడ్లీ కడై'. ఈ సినిమా 'ఇడ్లీ కొట్టు' పేరుతో అక్టోబర్ 1న తెలుగులో విడుదల కానుంది. నిత్యామీనన్ కథానాయిక. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకాలపై ఆకాశ్ భాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీ వేదక్షర మూవీస్ ద్వారా రామారావు చింతపల్లి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'గ్రైండర్ కొంటే పని తేలికవుతుంది.. సమయం కూడా ఆదా అవుతుంది..' అని తండ్రిని ఒప్పిస్తూ ధనుష్ చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్ సాగింది. సంప్రదాయ ఇడ్లీకొట్టు నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని ట్రైలర్ చెబుతున్నది. బడా వ్యాపారస్థుల కారణంగా తన ఇడ్లీకొట్టు మనుగడకే ముప్పు వాటిల్లినప్పుడు ఆ సవాళ్లను హీరో ఎలా ఎదుర్కొన్నాడు? తన గౌరవాన్ని నిలబెట్టుకునేందుకు హీరో చేసే పోరాటమేంటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా కథ అని తెలుస్తున్నది. ట్రైలర్‌లో ధనుష్, రాజ్‌కిరణ్ తండ్రీకొడుకులుగా కనిపించారు. అరుళ్‌విజయ్ ప్రతినాయకుడిగా అలరించారు. నిత్యామీనన్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ధనుష్, నిత్యాల కెమిస్ట్రీ కూడా బావుంది. షాలినీ పాండే, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, సంగీతం: జి.వి. ప్రకాశ్‌కుమార్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com